మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 18-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 258 Issue: 258

18 మార్చి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:25 సూర్యాస్తమయం - సా. 6:23 తిథి చతుర్దశి ఉ. 8:24 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం పూర్వాభాద్ర తె. 5:12ం వరకు తరువాత ఉత్తరాభాద్ర యోగం శుభ తె. 3:53ం వరకు కరణం శకుని ఉ. 8:24 వరకు చతుష్పాద రా. 7:39 వరకు వర్జ్యం మ. 12:20 నుండి మ. 1:53 వరకు దుర్ముహూర్తం మ. 12:00 నుండి మ. 12:48 వరకు రాహుకాలం మ. 12:24 నుండి మ. 1:54 వరకు యమగండం ఉ. 7:55 నుండి ఉ. 9:24 వరకు గుళికాకాలం ఉ. 10:54 నుండి మ. 12:24 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:49 నుండి తె. 5:37 వరకు అమృత ఘడియలు రా. 9:37 నుండి రా. 11:09 వరకు అభిజిత్ ముహూర్తం లేదు

Published from Jagitial
Circulated to Telangana



# 400 మందిని చంపేశారు!

## అఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ పైశాచిక చర్య.. కాబూల్ ఆస్పత్రిపై వైమానిక దాడి

## మరో 250 మందికి తీవ్ర గాయాలు.. దాడిని తీవ్రంగా ఖండించిన భారత్

ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్‌లో పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడులు పెను విషాదాన్ని మిగిల్చాయి. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో మాదకద్రవ్యాల వ్యసనం నుంచి విముక్తి పొందేందుకు చికిత్స అందిస్తున్న 'ఒమిడ్ అడిక్షన్ ట్రీట్‌మెంట్ హాస్పిటల్' లక్ష్యంగా పాక్ యుద్ధ విమానాలు క్షిపణులతో విరుచుకుపడ్డాయి. ఈ భీకర దాడిలో ఇప్పటివరకు 400 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 250 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది.

కాబూల్: 2,000 పడకల సామర్థ్యం కలిగిన ఈ భారీ ఆసుపత్రి భవనం దాడుల ధాటికి కుప్పకూలింది. దాడి జరిగిన సమయంలో వందలాది మంది రోగులు నిద్రలో ఉండటంతో ప్రాణనష్టం భారీగా జరిగింది. మృతుల్లో ఎక్కువ మంది పేద రోగులు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నట్లు సమాచారం. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీసేందుకు రెస్క్యూ టీమ్స్ శ్రమిస్తున్నాయని అధికారులు తెలిపారు. పౌర ఆసుపత్రిపై దాడి చేయడం అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధమని, ఇది మానవత్వానికి వ్యతిరేకమైన నేరమని తాలిబన్ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ మండిపడ్డారు. ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే, తాము కేవలం ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యంగా చేసుకున్నామని, పౌర ప్రాంతాలపై దాడులు చేయలేదని పాకిస్థాన్ ప్రభుత్వం బుకాయిస్తోంది. ఈ ఘటనతో ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఆసుపత్రి తరువాయి 2 వ పేజీలో...



2

# యస్.. పార్టీ వీడుతా!

కారకులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, అధిష్ఠానమే

4 దశాబ్దాల బంధాన్ని విడిచిపెట్టడం ఇబ్బందే.. కానీ!

నాకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు?

ఆయన ఏ పార్టీలో ఉన్నారో ఆయనకే తెలియదు

6 గ్యారెంటీలపై ప్రజల్లో అసంతృప్తి

జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,808 |
| వెండి (గ్రాము): | రూ.280 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,375 |

## విశ్వవాణి



ఆ పెంగ్విన్.. బంగారం! దాదాపు 1,20,000 పెంగ్విన్లు ఉన్న సౌత్ జార్జియా ఐలాండ్‌లో తొలిసారి 2019లో బంగారు వర్ణపు పెంగ్విన్ కనిపించింది. జన్యు పరిణామం వల్ల ఈ రంగు వచ్చిందని శాస్త్రవేత్తలు తేల్చారు. అయితే, మళ్లీ అలాంటి పెంగ్విన్ ఇప్పటి వరకు కనిపించలేదు.

# కాంగ్రెస్‌కు... 420 కప్

## ఎగ్గొట్టు.. కూలగొట్టు.. చెడగొట్టు

## గ్యారెంటీల ఫైల్ కాకి ఎత్తుకపోయిందా?



## రాష్ట్రంలో కాంగ్రెస్ డిజాస్టర్ పాలన

### 25 లక్షల ప్రజాపాలన దరఖాస్తులు ఏవి?

### రేవంత్ దానకర్ణుడు కాదు.. కుంభకర్ణుడు

### అసెంబ్లీలో కేటీఆర్ విమర్శల అస్త్రాలు

ఉగాదులు, ఉషస్సులు వస్తున్నాయ్.. పోతున్నాయ్.. ప్రజల జీవితాల్లో వెలుగులేవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఎగ్గొట్టు, కూలగొట్టు, చెడగొట్టు.. ఇదీ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎగనామాలు.. పంగనామాలు.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యమని ప్రశ్నించారు.

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): ఆరు గ్యారంటీల కోసం కోటి 25 లక్షల మంది చేసుకున్న ప్రజాపాలన దరఖాస్తులు ఏమయ్యాయని కేటీఆర్ ప్రశ్నించారు. గ్యారంటీ కార్డులు బాకీ కార్డులుగా మారి వెక్కిరిస్తున్నాయని అన్నారు. ఇండియా క్రికెట్‌లో టీ20 వరల్డ్ కప్ గెలిచింది.. అదే 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ ఫస్ట్ వస్తుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చారాణా పని చేసి.. బారాణ చేసినట్లుగా చెప్పుకుంటుం దని అన్నారు. నేనే రాజు.. నేనే మంత్రి అని మిడిసి పడితే మూటకట్టుకుని పోతారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి తొలి సంతకం చేసిన ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్



# దత్తత తల్లులకు ప్రసూతి సెలవులు

### పితృత్వ సెలవులూ సామాజిక ప్రయోజనం

### స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

దత్తత తీసుకునే తల్లులకు మెటర్నిటీ సెలవుల విషయంలో ఉన్న ఆంక్షలను సుప్రీంకోర్టు కొట్టివేసింది. అదే సమయంలో దేశంలో పితృత్వ సెలవులను ఒక సామాజిక భద్రతా ప్రయోజనంగా గుర్తిస్తూ ప్రత్యేక చట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి అత్యున్నత న్యాయస్థానం సూచించింది.

న్యూఢిల్లీ: ఇది దేశవ్యాప్తంగా ఉద్యోగుల హక్కులపై జరుగుతున్న చర్చలో ఒక ముఖ్యమైన పరిణామం. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. 'సోషల్ సెక్యూరిటీ కోడ్, 2020'లోని సెక్షన్ 60(4)ను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తూ కొట్టివేసింది. ఈ నిబంధన ప్రకారం మూడు నెలల కంటే తక్కువ వయసు ఉన్న శిశువును దత్తత తీసుకున్న తల్లులకు మాత్రమే ప్రసూతి సెలవులు వర్తిస్తాయి. ఈ నిబంధన సమానత్వ హక్కును తరువాయి 2 వ పేజీలో...



# డ్రగ్స్ 'పుట్ట' కేసులో సిట్

రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసును సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. రిమాండ్‌లో ఉన్న నిందితులను విచారించడం, డ్రగ్స్ పార్టీపై లోతుగా విచారణను జరపడం కోసం తొమ్మిది మంది అధికారులకు బాధ్యతలు అప్పగించింది.

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): సీపీ సుధీర్ బాబు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం ఈ కేసును దర్యాప్తు చేయనుంది. సిట్ చీఫ్‌గా చీఫ్‌గా చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ వ్యవహరించనున్నారు. సభ్యులుగా గ్రేహౌండ్స్ కమాండర్ రవీంద ర్ రెడ్డి, షాద్‌నగర్ డీసీపీ శిరీష, ఈగల్ డీఎస్పీలు బుచ్చయ్య, హరీశ్ తరువాయి 2 వ పేజీలో...

# 20న రాష్ట్ర కేబినెట్ భేటీ



హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మార్చి 20న జరగనున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్ లో ఉదయం 9.30 గంటలకు మంత్రివర్గం భేటీ కానుంది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందు క్యాబినెట్ సమావేశమై ఆమోదించడం ఆనవాయితీ. ప్రతీ బడ్జెట్ రోజున లాంఛనంగా సెషన్ ప్రారంభం కావడానికి గంట ముందు ఇలాంటి క్యాబినెట్ భేటీ అసెంబ్లీ భవనంలోని మీటింగ్ హాల్‌లోనే జరుగుతూ ఉంటుంది. అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు క్యాబినెట్ ఆమోదం తప్పనిసరి -2 వ పేజీలో...





# ఈపీఎఫ్ పింఛను పెంచాలి

### పార్లమెంటరీ ప్యానెల్ కేంద్రానికి కీలక ప్రతిపాదనలు

ఈపీఎఫ్ చందాదారులు రిటైర్మెంట్ తర్వాత పొందే పెన్షన్‌కు సంబంధించి పార్లమెంటరీ ప్యానెల్ కేంద్రానికి కీలక ప్రతిపాదనలు చేసింది. ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995 (జూలా, 1995) కింద ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.1000 కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కమిటీ సూచించింది. ఆ మొత్తం వాస్తవికంగా, గౌరవప్రదంగా ఉండాలని అభిప్రాయపడింది. 2

# మాకు సాయం అక్కర్లేదు

## నాటో దేశాలకు తేల్చి చెప్పిన ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇరాన్ పై యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న పలు దేశాలు హార్మూజ్ జలసంధి వద్దకు ప్రపంచ దేశాలు యుద్ధ నౌకలను పంపడానికి నిరాకరించాయి. ట్రంప్ అభ్యర్థనను -2 వ పేజీలో...






# నందాదేవి వచ్చేసింది!

### 46 వేల మెట్రిక్ టన్నుల ఎల్పీజీతో గుజరాత్‌కు చేరిక

అహ్మదాబాద్: ఎల్పీజీ చమురు కలిగిన రెండో నౌక మంగళవారం గుజరాత్ పోర్టుకు చేరుకుంది. ఎల్పీజీ ట్యాంకర్లతో కూడిన ఎంటీ నందాదేవి అనే పేరుగల నౌక మంగళవారం గుజరాత్‌లోని వాడినార్ పోర్టుకు చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ నౌక హోర్ముజ్ జలసంధి నుంచి ఇక్కడికి రావడం విశేషం. ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యాక ఈ జలసంధి నుంచి ఇండియా చేరుకున్న రెండో నౌక ఇది. ఈ నౌకలో దాదాపు 46,500 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది. ఈ నౌక నుంచి చమురును బదిలీ చేసే చర్యను తరువాయి 2 వ పేజీలో...





# రెనాల్ట్ డస్టర్ రీ ఎంట్రీ

2026 గణతంత్ర దినోత్సవం రోజు గ్లోబల్ మార్కెట్లో లాంచ్ అయిన రెనాల్ట్ డస్టర్ కారు.. ఎట్టకేలకు దేశీయ విఫణిలో అడుగుపెట్టింది. ఐదు వేరియంట్లు, మూడు ఇంజిన్ ఎంపికలతో లభించే ఈ కారు.. ఆరు రంగుల్లో లభిస్తుంది. దీని ధరలు రూ. 10.49 లక్షలు (ఎక్స్ షోరూమ్). 2

## వాట్సాప్‌లో 'గెస్ట్ చాట్స్' ఫీచర్

## రాశి ఫలాలు

18.3.2026

మేషం: సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. సంతానం నుండి శుభవార్తలు వింటారు. వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

వృషభం: కుటుంబ వ్యవహారాలలో స్థిరమైన ఆలోచనలు చేసి మీ విలువ పెంచుకుంటారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో వివాదాలు ఓ కొలిక్కి వస్తాయి. దూర ప్రయాణాలు లాభిస్తాయి. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో ఆశించిన అభివృద్ధి కలుగుతుంది.

మిధునం: ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధుమిత్రులతో ధన వ్యవహారాలలో జాగ్రత్తగా ఉండడం మంచిది. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. గృహనిర్మాణ ప్రయత్నాలు త్వరితగతిన పూర్తికావు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. నిరుద్యోగ యత్నాలు కలిసిరావు.

కర్కాటకం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. గృహమున కొందరి ప్రవర్తన ఇబ్బంది కలిగిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో నూతన ప్రోత్సహకాలు అందుకుంటారు. ఇతరుల నుండి అవసరానికి సహాయం అందుతుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభిస్తాయి.

సింహం: సోదరులతో స్థిరాస్తి వివాదాలు తొలగుతాయి. విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగమున అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. గృహమున బంధు మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సంతాన విద్యా విషయంలో శుభ వార్తలు అందుతాయి.

కన్య: జీవిత భాగస్వామితో మనస్పర్ధలు పెరుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. గృహంలో చికాకులు పెరుగుతాయి. ఆర్ధిక వ్యవహారాలు మరింత ఇబ్బంది కలిగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

తుల: కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. వృధా ఖర్చులు పెరుగుతాయి. దూర ప్రయాణాలు చేస్తారు. నూతన ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో స్థిరమైన నిర్ణయాలు తీసుకోకపోవడం వలన నష్టపడతారు. ఉద్యోగాలలో అధికారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది.

వృశ్చికం: సోదరుల సహాయంతో వివాదాల నుండి బయట పడతారు. ఆర్ధిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. బంధుమిత్రుల ఆగమనం సంతోషం కలిగిస్తుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగస్థులకు పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటా బయట కొందరి ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. కుటుంబ వ్యవహారాలలో సొంత నిర్ణయాలు తీసుకోరాదు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆలయ సందర్శన చేసుకుంటారు. ఉద్యోగమున అధికారులతో అప్రమత్తంగా ఉండాలి.

మకరం: చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. ఆర్థికంగా పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో స్థిరమైన ఆలోచనలు చేసి లాభపడతారు. ఉద్యోగాలలో ఉత్సాహకర వాతావరణం ఉంటుంది.

కుంభం: వృత్తి వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు రావు. ఉద్యోగమున మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభించదు. ఋణ ప్రయత్నాలు కలిసిరావు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పత్రాల విషయంలో జాగ్రత్త వహించాలి.

మీనం: ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. గృహమున బంధు మిత్రుల రాక ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగమున అనుకూలత పెరుగుతుంది.

# 400 మందిని చంపేశారు!



మొదటి పేజీ తరువాయి

ధ్వంసమై వందలాది మంది అమాయకులు బలికావడంతో అంతర్జాతీయ సమాజం ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా సంస్థలు వెల్లడించాయి.

### పాకిస్థాన్‌ది పిరికిపంద చర్య: భారత్

అఫ్గానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. 'పాక్‌ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతిభద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దులకు ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలి" అని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ విపత్కర సమయంలో ఆ దేశ ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది.

# కాంగ్రెస్‌కు 420 కప్

మొదటి పేజీ తరువాయి

చేశారు. మూసీలో ముంచుతున్న ఇండ్లకు జీరో వాల్యూ కాదు.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక చేసిన తొలి సంతకానికి జీరో వాల్యూ అని తెలిపారు. కాంగ్రెస్ గ్యారంటీ కార్డులకు, డిక్లరేషన్లకు ప్రజల్లో జీరో వాల్యూ అని అన్నారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడితే కర్ణుడిని అని చెప్పుకంటున్నాడని.. ఆయన ఎన్నికల ముందు దానకర్ణ.. ఇప్పుడు కుంభకర్ణ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల కోసం ఢిల్లీ నుంచి విమానాలు వేసుకుని వచ్చారని.. కానీ వాటిని అమలు మాత్రం చేయడం లేదని అన్నారు. ఇక తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు.

### ప్రభుత్వానికి ఎందుకు ధన్యవాదాలు చెప్పాలి?

పాలకులు ప్రజలకు ఇచ్చిన మాటను నెలబెట్టుకోవాలని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగం, అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి విలువ ఉండాలని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ప్రాధాన్యత ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ గవర్నర్ ప్రసంగానికి విలువ లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలి.. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు ఎవరు ధన్యవాదాలు చెప్పాలని నిలదీశారు. గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి మోసం చేయలేదా అని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు ఎక్కడ దాచిపెట్టాలో చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం చేసిన ఫైల్ ఏమైందని అసెంబ్లీ సాక్షిగా కేటీఆర్ నిలదీశారు. కీలకమైన ఆ ఫైల్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. మాయమైన ఫైల్ కోసం సిట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తుల విలువ జీరో చేసింది ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు జీరో వాల్యూ ఉందని అన్నారు. వంద రోజుల్లోనే గ్యారెంటీల అమలు ఏమైందని ప్రశ్నించారు. తొలి కేబినెట్‌లోనే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత అన్న మాట ఏమైందని అడిగారు. సీఎం తొలి సంతకం చేసిన ఫైల్‌కు జీరో వాల్యూ ఉందని విమర్శించారు. విశ్వసనీయత కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వానికి జీరో వాల్యూ అని వ్యాఖ్యానించారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న కుటుంబాన్ని చూపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 హామీ ఏమైందని అడిగారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైందని నిలదీశారు. గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడం లేదని మండిపడ్డారు. గ్యారంటీలు, హామీల అమలు విషయంలో ఎందుకింత నిర్లక్ష్యమని కేటీఆర్ ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో రేషన్ కార్డులు ఇవ్వలేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఇవ్వలేదని నిండు సభలో ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పలేదా అని అడిగారు. పదే పదే అబద్ధాలు వల్లె వేస్తే లాభం ఎవరికి అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరనింద ఆత్మస్తుతి మానుకోవాలని హితవుపలికారు. మోసాల కాలంలో నిజాలు చెప్పడమే అతి పెద్ద విప్లవం కాదా? అని వ్యాఖ్యానించారు.

# ఈపీఎఫ్ పింఛను పెంచాలి

### పార్లమెంటరీ ప్యానెల్

న్యూఢిల్లీ: ఈపీఎఫ్ చందాదారులు రిటైర్మెంట్ తర్వాత పొందే పెన్షన్‌కు సంబంధించి పార్లమెంటరీ ప్యానెల్ కేంద్రానికి కీలక ప్రతిపాదనలు చేసింది. ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995 (ఇపీఎస్, 1995) కింద ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.1000 కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కమిటీ సూచించింది. ఆ మొత్తం వాస్తవికంగా, గౌరవప్రదంగా ఉండాలని అభిప్రాయపడింది. ఈ మేరకు లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్‌డెవలప్‌మెంట్‌పై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 15వ నివేదికలో పలు అంశాలను ప్రస్తావించింది. ఈపీఎస్ కనీస పెన్షన్ పెంచాలని పెన్షనర్లు ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పుడు అందుతున్న మొత్తం ఏమాత్రం సరిపోవడం లేదని, దాన్ని రూ.7,500కు పెంచాలని వారు కోరుతున్నారు. ఇదే డిమాండ్‌తో ఇటీవల దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మూడు రోజుల పాటు ధర్నా నిర్వహించారు. ఈ నేపథ్యంలో పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పందించింది. కనీస పెన్షన్‌పై ఇప్పటికే పెన్షనర్ల నుంచి పలు విజ్ఞాపనలు వచ్చినట్లు పేర్కొంది. ద్రవ్యోల్బణం, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, జీవన వ్యయాలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న కనీస మొత్తం ఏమాత్రం సరిపోదని కమిటీ అభిప్రాయపడింది. కాబట్టి ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995ని పునః సమీక్షించి పెన్షన్ మొత్తాన్ని పెంచాలని ప్రతిపాదించింది. ఇందుకోసం కేటాయింపులు చేయాలని సూచించింది. లేబర్ కోడ్‌ల అమలును కమిటీ స్వాగతించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో పర్మినెంట్ కో-ఆర్డినేషన్, ఇంటరాక్షన్ బోర్డును నెలకొల్పాలని ప్రతిపాదించింది. ప్రభుత్వం అందించే వివిధ పథకాల అమలు తీరుతెన్నులనూ ఈ బోర్డు పరిశీలిస్తుందని పేర్కొంది. పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే రెగ్యులర్ వర్కర్ల మాదిరిగా పనిచేసే కాంట్రాక్టు వర్కర్లకు మాత్రం పరిహారం అందడంలో జాప్యం జరుగుతోందని, వారికి సత్వరమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రతిపాదించింది.

# రెనాల్ట్ డస్టర్ రీ ఎంట్రీ

ముంబై: 2026 గణతంత్ర దినోత్సవం రోజు గ్లోబల్ మార్కెట్లో లాంచ్ అయిన రెనాల్ట్ డస్టర్ కారు.. ఎట్టకేలకు దేశీయ విఫణిలో అడుగుపెట్టింది. ఐదు వేరియంట్లు, మూడు ఇంజిన్ ఎంపికలతో లభించే ఈ కారు.. ఆరు రంగుల్లో లభిస్తుంది. దీని ధరలు రూ. 10.49 లక్షలు (ఎక్స్ షోరూమ్). రెనాల్ట్ కంపెనీ 2026 డస్టర్ కోసం ఇప్పటికే బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. కాబట్టి డెలివరీలు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఇది హ్యుందాయ్ క్రెటా, మారుతి సుజుకి విక్టోరిస్, కియా సెల్టోస్ వంటి ప్రముఖ మోడళ్లకు ప్రధాన ప్రత్యర్థిగా ఉంటుంది. ఇంజిన్ ఆప్షన్స్ విషయానికి వస్తే.. 2026 రెనాల్ట్ డస్టర్ టాప్ వేరియంట్‌లో 1.8-లీటర్ ఫోర్-సిలిండర్ డైరెక్ట్ ఇంజెక్షన్ పెట్రోల్ ఇంజన్ ఉంటుంది. దీనిని రెండు ఎలక్ట్రిక్ మోటార్లతో జతచేసి జు-టెక్ 160 హైబ్రిడ్ సెటప్‌తో రూపొందించారు. ఇది 160 బీహెచ్‌పీ పవర్, 172 ఎన్ఎం టార్క్ అందిస్తుంది. 160 బీహెచ్పీ పవర్, 280 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేసే 1.3-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజన్ కూడా ఉంది. ఇది 6 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్, డ్యూయల్-క్లచ్ ఆటోమేటిక్ ఆప్షన్ రెండింటితోనూ అందుబాటులో ఉంది. కొత్త రెనాల్ట్ డస్టర్ వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లేతో కూడిన 10.1 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్, 10.25 ఇంచెస్ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, యాంబియంట్ లైటింగ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 6 వే పవర్డ్ ఫ్రంట్ సీట్లు, పవర్డ్ టెయిల్‌గేట్, డ్యూయల్ జోన్ క్లైమేట్ కంట్రోల్, పుష్-బటన్ స్టార్ట్/స్టాప్ మరియు మరిన్ని ఫీచర్లతో వస్తుంది.

# వాట్సాప్‌లో 'గెస్ట్ చాట్స్' ఫీచర్

వాట్సాప్ మరో సరికొత్త ఫీచర్‌ను తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. 'గెస్ట్ చాట్స్' పేరుతో ఈ ఫీచర్ ప్రస్తుతం పరిమిత స్థాయిలో టెస్టింగ్ దశలో ఉంది. ఈ ఫీచర్ ద్వారా వాట్సాప్ అకౌంట్ లేని వ్యక్తులతో కూడా చాట్ చేయగలగడం ప్రత్యేకతగా చెప్పుకోవాలి. దీంతో 'మెటా' తన మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌ను మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. గెస్ట్ చాట్స్ ఫీచర్‌ను ప్రస్తుతం ఆండ్రాయిడ్, ఐఓఎస్ సహా వెబ్ వెర్షన్‌లలోని పరిమిత బీటా వినియోగదారులకు అందుబాటులో ఉంది. పరిమిత సంఖ్యలో టెస్టింగ్ చేస్తోంది. ఈ గెస్ట్ చాట్స్ ఫీచర్ ఎలా పనిచేస్తుందంటే... ముందుగా వినియోగదారులు ఒక సెక్యూర్ ఇన్విటేషన్ లింక్‌ను రూపొందించాలి. దాన్ని ఎస్ఎంఎస్, ఈమెయిల్ లేదా ఇతర మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా షేర్ చేయవచ్చు. ఆ లింక్‌ను ఓపెన్ చేసిన వ్యక్తి వాట్సాప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదా నేరుగా వెబ్ బ్రౌజర్‌లో గెస్ట్‌గా చాట్‌లో చేరవచ్చు. గెస్ట్ యూజర్‌కు ప్రత్యేకమైన ఐడెంటిఫైయర్ ఇస్తుంది. ఇది ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ కీలా పనిచేస్తుంది. అలాగే క్యూర్ కోడ్ లేదా సెక్యూరిటీ కోడ్ ద్వారా చాట్ భద్రతను కూడా వెరిఫై చేసుకోవచ్చు. గెస్ట్‌గా చాట్‌లో చేరే ముందు యూజర్ ఒక డిస్‌ప్లే నేమ్ ఇవ్వాలి. అయితే ఈ పేరు అసలైందో కాదో వాట్సాప్ వెరిఫై చేయదు. గెస్ట్ యూజర్లతో జరిగే చాట్స్ 'గెస్ట్' అనే లేబుల్‌తో స్పష్టంగా చూపించబడతాయి. దాంతో పారదర్శకత ఉంటుంది. అయితే ఈ ఫీచర్‌కు కొన్ని పరిమితులు కూడా ఉన్నాయి. గెస్ట్ చాట్స్ తాత్కాలికంగా మాత్రమే పని చేస్తాయి. కేవలం టెక్స్ట్ మెసేజింగ్‌కు మాత్రమే ఈ ఫీచర్ పరిమితం. ఫోటోలు, వీడియోలు, వాయిస్ నోట్స్, కాల్స్, గ్రూప్ చాట్స్ వంటి ఫీచర్లు అందుబాటులో ఉండవు. అలాగే కొంత సమయం యాక్టివిటీ లేకపోతే సెషన్ ఆటోమేటిక్‌గా ముగుస్తుంది. మళ్లీ చాట్ కొనసాగించాలంటే.. కొత్త ఇన్విటేషన్ లింక్ తప్పనిసరి.

# దత్తత తల్లులకు ప్రసూతి సెలవులు

మొదటి పేజీ తరువాయి

ఉల్లంఘిస్తోందని, ఇది వివక్షాపూరితమని కోర్టు అభిప్రాయపడింది. "దత్తత తీసుకున్న బిడ్డ అవసరాలు, కన్నబిడ్డ అవసరాలకు ఏమాత్రం భిన్నంగా ఉండవు. పిల్లల సంరక్షణలో తండ్రులను కూడా సమాన భాగస్వాములుగా గుర్తించాలి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పితృత్వ సెలవులు, వాటి వ్యవధి వంటి అంశాలు కేంద్ర ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తాయని చెబుతూనే, దీనిపై ఒక స్పష్టమైన చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ అవసరాన్ని నొక్కి చెప్పింది. దత్తత తీసుకున్న తల్లులకు 12 వారాల ప్రసూతి సెలవులను పరిమితం చేస్తూ 2017లో 'మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్, 1961'లో చేసిన సవరణను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం అర్హులైన మహిళలకు 26 వారాల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు అందుబాటులో ఉండగా, పితృత్వ సెలవులకు సంబంధించి దేశంలో ఎలాంటి ప్రత్యేక చట్టం లేదు. తాజా తీర్పుతో దత్తత తీసుకున్న పిల్లల వయసుతో సంబంధం లేకుండా తల్లులు పూర్తి ప్రసూతి ప్రయోజనాలు పొందేందుకు మార్గం సుగమమైంది.

## 20న రాష్ట్ర కేబినెట్ భేటీ

మొదటి పేజీ తరువాయి

కావడంతో ఈ సమావేశం జరగడం రొటీన్ ప్రాక్టీస్. ప్రభుత్వ ప్రయారిటీలకు అనుగుణంగా ముందుగానే చర్చించి తర్వాత బడ్జెట్ రూపొందుతుంది. చివరి నిమిషంలో మార్పులు చేర్పులు ఏమైనా ఉంటే వాటిని చేర్చడంపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుంది. క్యాబినెట్ సమావేశానికి వివిధ శాఖల అధికారులు కూడా హాజరవుతారు.

# డ్రగ్స్ 'పుట్ట' కేసులో సిట్

మొదటి పేజీ తరువాయి

చంద్రారెడ్డి, మొయినాబాద్ ఎస్‌హెచ్‌వో మల్లిఖార్జున, ఎస్ఐలు కోటేశ్వర్ రావు, వెంకన్న, సదత్ అలీలు ఎంపికయ్యారు. పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని సిట్ ఆరోపించింది. వెంటనే రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారులకు సిట్ లేఖ రాసింది. ప్రధాన నిందితులు పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేశ్ రెడ్డి, నమిత్ శర్మలను ఏడు రోజులకు కస్టడీ కోరింది.అలానే రితేశ్ రెడ్డి గన్ లైసెన్స్ రద్దు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు సిట్ లేఖ రాసింది.

### వారంలో వివరణ ఇయ్యు.. పైలట్‌కు కేసీఆర్ నోటీసులు

పైలట్ రోహిత్ రెడ్డి వ్యవహారాన్ని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ద్వారా వచ్చిన ఆరోపణలపై వారం రోజుల్లోగా స్పష్టంగా లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. షోకాజు నోటీసుకు గడువులోపు వివరణ సమర్పించకపోతే.. పార్టీ నియమావళి ప్రకారం వేటు వేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి, పార్టీ క్రమశిక్షణా వ్యవహారాల బాధ్యులు సోమ భరత్ కుమార్ షోకాజ్ నోటీసు జారీ చేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక సమావేశంలో హాజరైన సమయంలో, అక్కడ మాదక ద్రవ్యాలు వినిగియోంచారని వివిధ మీడియా నివేదికలు, ఇతర విశ్వసనీయ సమాచారం ద్వారా పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి వచ్చిందని షోకాజ్ నోటీసుల్లో తెలిపారు. ఈ వార్తలు విస్తృతంగా మీడియాలో ప్రసారం కావడంతో పాటు పార్టీకి, ప్రజల్లో కూడా తీవ్ర ఆందోళనలు కలిగించాయని పేర్కొన్నారు. బీఆర్ ఎస్ పార్టీ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ సంస్థగా చట్టపరమైన నిబంధ నలు, నైతిక విలువలు పాటించడంలో విశ్వాసం కలిగిందని నోటీసుల్లో పేర్కొన్నారు.

## మాకు సాయం అక్కర్లేదు

మొదటి పేజీ తరువాయి

నాటో దేశాలు సున్నితంగా తోసిపుచ్చాయి. అమెరికా సైన్యాలతో కలిసి ఇరాన్‌పై యుద్ధం చేయబోమని వాషింగ్టన్ సిటీకి నాటో కూటమిలోని దేశాలు చెప్పేశాయి. దాంతో.. ఇదివరకు ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండడాన్ని వ్యతిరేకించిన నాటో దేశాలు ఇప్పుడు తనకు సహకరించకపోవడాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. మంగళవారం ఈ కూటమి దేశాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ట్రంప్.. నాటోను 'ఒకే వైపున్నవీధి'గా విమర్శించారు. 'నాటోలోని కొన్ని దేశాల రక్షణ కోసం అమెరికా ఏటా కొన్ని వందల కొద్ది బిలియన్ డాలర్లను ఖర్చు చేస్తోంది. కానీ, బదులుగా అమెరికాకు ఈ దేశాలు ఏమీ చేయడం లేదు. ఇరాన్ సైన్యాన్ని అమెరికా నాశనం చేసింది. ఆ దేశ నావికా దళం, వాయుసేన, నాయకత్వాన్ని దెబ్బతీశాం. ఇప్పటివరకూ ప్రపంచంలోనే అమెరికా శక్తివంతమైన దేశం. మాతో కలిసి వచ్చేందుకు నిరాకరిస్తున్న నాటో దేశాలు చాలా తెలివితక్కువ పొరపాటు చేస్తున్నాయి.

# యస్.. పార్టీ వీడుతా!

**కారకులు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్, అధిష్ఠానమే**

**4 దశాబ్దాల బంధాన్ని విడిచిపెట్టడం ఇబ్బందే.. కానీ!**

**నాకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు?**

**6 గ్యారెంటీలపై ప్రజల్లో అసంతృప్తి: జీవన్ రెడ్డి**

జగిత్యాల బ్యూరో, మార్చి 17 (ఈవార్తలు): మాజీ మంత్రి జీవన్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీలో ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో ఉన్నానని చెబుతున్న సంజయ్.. నన్ను తనతో కలిసి పనిచేయాలని ఎలా అడుగుతారంటూ ప్రశ్నలు సంధించారు. నాడు ప్రతిపక్షంలో ఉండి ఒంటిచేత్తో అధికారపార్టీతో పోరాటం చేసిన నేను మంత్రి కావాలనుకోవడం తప్పా? పార్టీ ఫిరాయింపునకు నాకు అవకాశం లేకుండేనా? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'నాలుగు దశాబ్దాల బంధాన్ని విడిచి పెట్టుకోవడం ఎవరికైనా ఇబ్బందే. ఆ స్థితిలో నేను ఇవాళ బాధ పడుతున్నాను. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్.. ఆయన ఏ పార్టీలో ఉన్నారో తెలియదు కానీ.. నన్నే తనతో కలిసి పని చేయాలని ఆఫర్ ఇస్తున్నారు.

అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పని చేయడంలో తప్పు లేదు. కానీ, కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, హక్కులను కాలరాయడం, అభ్యర్థుల ఎంపిక చేయడం ఇవన్నీ సమంజసమా? మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నేను పార్టీలో ఎదురవుతున్న పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేశాను. ఇందుకు ఎమ్మెల్యే సంజయ్ కారణం కాదా? 1995లో చంద్రబాబు సీఎం అయిన సమయంలో ఎక్కడా పోటీకి కూడా వెనుకంజ వేసిన కాలంలో జగిత్యాల నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మేం అన్నీ గెల్చుకున్నాం. వీడిపోవడానికి కారకుడైన వ్యక్తి ఇవాళ కలిసి పని చేస్తానంటున్నాడు. నేను ఎక్కడ ఉన్నా అంకితభావంతో పనిచేస్తా. ఈ ఎమ్మెల్యే సంజయ్ ఒత్తిడితో ఓ ఆడబిడ్డ మున్సిపాలిటీలో ఇబ్బంది పడింది నిజం కాదా? నాకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు? నేను పార్టీ వీడుతానని ఆయనకు చెప్పానా? పార్టీ వీడాలని కోరుకోవడం లేదని ఎలా అంటారు? అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారు? నన్ను ఎలా కలిసి రమ్మంటారు? సంజయ్ బీఆర్ఎస్‌లో ఉన్నారని స్పీకర్ అంటున్నారు. కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాలని సంజయ్ అంటున్నారు. అసలు ఎవరు ఏ పార్టీలో ఉన్నారు? ఈ ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఉన్న సమస్యలు పట్టించుకోడు. చట్టసభల్లో ఎంపికైన వాళ్ళు ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకోవాలి. నేను ఇంతవరకు కూడా కాంగ్రెస్‌లోనే ఉన్నాను. ఉండాలని ఇంకా కోరుకుంటున్నా. ఇంట్లో ఉడుం లాగా వచ్చి చేరితే ఆయనతో కలిసి ఎలా పనిచేస్తాం. నిన్నటి వరకు రాష్ట్రానికి జగిత్యాల ఆదర్శంగా ఉంటే ఇవాళ వివాదాలకు కేరాఫ్ చేశాడు. రాముడు నాకు ఆదర్శం. అందుకే శ్రీరామనవమి సందర్భంగా ఫ్లెక్సీలు పెట్టుకున్నా. నేను పార్టీ మారితే దానికి కారణం ఎమ్మెల్యే సంజయ్, ఆయన వెనుకున్న వారే కారణం అవుతారు. ఈ ఎపిసోడ్‌లో కాంగ్రెస్ అధిష్టానానిదే బాధ్యత. నాకు పార్టీ మారాలనే యోచనకు కారణం ఈ ఆవేదనే' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

# దానంపై స్పీకర్ తీర్పు తప్పు

### కానీ ఆ సీటును గౌరవిస్తున్నాం: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): దానం నాగేందర్ తమ పార్టీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా గెలుపొంది, ఆ తర్వాత జరిగిన లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శాసనసభలో ఆయన పార్టీ ఫిరాయింపులపై మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పటికీ స్పీకర్ ఆయనకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని అన్నారు. తీర్పు తప్పుగా ఉన్నప్పటికీ, తాము స్పీకర్‌ను గౌరవిస్తున్నామని అన్నారు. పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసిందే కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ పార్టీ నాయకులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, బాల్క సుమన్‌లపై దాడులు జరిగాయని, హరీశ్ రావు క్యాంపు కార్యాలయం, తన క్యాంపు కార్యాలయంపై కూడా దాడులు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 67 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటోందని, కానీ ఇచ్చింది 11 వేల ఉద్యోగాలే అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అసెంబ్లీ సాక్షిగా చెప్పిన జాబ్ క్యాలెండర్ ఉత్తుత్తి క్యాలెండర్ అయిందని విమర్శించారు. ఏ గ్రామంలో అయినా సంపూర్ణ రుణమాఫీ అయినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి హార్వర్డ్ లో చాలా నేర్చుకున్నారని, ఆ ఖర్చును కూడా ప్రభుత్వమే భరించిందని ఎద్దేవా చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఎప్పుడు విడుదల చేస్తారని ప్రశ్నించారు. గట్టిగా అడిగితే బెదిరింపులు తప్ప ఏమీ లేదని అన్నారు. ఉచిత బస్సు పథకానికి తాము వ్యతిరేకం కాదని, కానీ బస్సులను పెంచాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క ఇటుక పెట్టలేదు కానీ కూల్చివేతలు



మాత్రం జరుగుతున్నాయని అన్నారు. శారదా పీఠానికి ఇచ్చిన భూములు కూడా వదలడం లేదని అన్నారు.

**స్పీకర్ తీర్పునే ప్రశ్నిస్తావా?: పొంగులేటి**

స్పీకర్ జడ్జిమెంట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించడం ఆయన అహంకారానికి నిదర్శనమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శాసనసభలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేశారని సభ దృష్టికి కేటీఆర్ తీసుకువచ్చారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందిస్తూ, కేటీఆర్ జడ్జిమెంట్ కాపీని పూర్తిగా చదివి మాట్లాడాలని సూచించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సభాపతి జడ్జిమెంట్‌ను కేటీఆర్ ప్రశ్నించడం సరికాదని అన్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. కేటీఆర్ కట్టుకథలు చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై పదేపదే ఆరోపణలు చేసే బీఆర్ఎస్ పార్టీ వరుసగా నాలుగు ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయిందని నిలదీశారు. అసెంబ్లీ, పార్లమెంట్, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో వరుసగా ఓడిపోయారని అన్నారు. నిరంకుశానికి బ్రాండ్ అంబాసిడర్లు బీఆర్ఎస్ నాయకులు అని మంత్రి అన్నారు.

# ఆపేసిన నిధులతోనే రా!

**సిద్దిపేటకు 1,070 కోట్లు ఎందుకు రద్దు చేశావ్?**

**సీఎం రేవంత్‌పై హరీశ్ రావు మండిపాటు**

సిద్దిపేట, మార్చి 17 (ఈవార్తలు): సిద్దిపేట అభివృద్ధిపై అక్కసు పెట్టుకుని ఈ జిల్లాకు ఎలా అడుగుపెడతావని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేటపై ఎందుకింత కక్ష అని నిలదీశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా సిద్దిపేటపై ఈర్ష్యాద్వేషాలేనా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల కోసం విడుదలైన 1,070 కోట్ల రూపాయల నిధులను ఎందుకు రద్దు చేశావని నిలదీశారు. ఆ నిధులను పునరుద్ధరించి సిద్దిపేట నియోజకవర్గంలో అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. కక్షపూరితంగా నువ్వు రద్దు చేసిన నిధుల గురించి.. ఆగిపోయిన పనుల గురించి మా సిద్దిపేట ప్రజలకు ఏం సమాధానం చెబుతావని ప్రశ్నించారు. సిద్దిపేట



అభివృద్ధిపై ఆనాడు నువ్వు చేసిన విమర్శలను, నీ ఓర్వలేని తనాన్ని మా ప్రజలు మర్చిపోలేదని హరీశ్రావు అన్నారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇక్కడ ఒక్క పనైనా చేశారా అని ప్రశ్నించారు. నువ్వు ప్రారంభించేందుకు వస్తున్న పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిధులు కూడా మా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విడుదలైనవే అని స్పష్టం చేశారు. సిద్దిపేట అభివృద్ధిని విస్మరించడమే కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను పూర్తిగా రద్దు చేశారని, నిధులు రద్దు కావడంతో 27 నెలలుగా పనులు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సిద్దిపేట నియోజకవర్గంలోని అభివృద్ధి పనుల కోసం రూ.1070.73 (ఒక వెయ్యి డెబ్బై కోట్ల డెబ్బై మూడు లక్షల రూపాయలు) కేటాయింపు జరిగిందని.. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి కొనసాగిస్తుండగా అర్ధంతరంగా ఈ నిధులను మీరు రద్దు చేశారని తెలిపారు. దీంతో పనులన్నీ ఆగిపోయాయని అన్నారు. చేసిన పనులకు కూడా నిధులు మంజూరు చేయకపోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ పనులన్నీ జరిగితే సిద్దిపేట భవిష్యత్తు మరోలా ఉండేదని అన్నారు. సిద్దిపేట ప్రగతిపై కక్షపూరితంగా వ్యవహరించకుండా వెంటనే మీరు రద్దు చేసిన నిధులను పునరుద్దరించాలలని డిమాండ్ చేశారు. అర్ధాంతరంగా ఆగిన పనులు జరిగేలా చర్యలు తీసుకొని మీ గౌరవాన్ని కాపాడుకోవాలని హితవు పలికారు.

# రేణు దేశాయ్ కేసులో ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): సోషల్ మీడియా వేదికగా మహిళలను, సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వారిపై సైబరాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ముఖ్యంగా నటి రేణు దేశాయ్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితులను కటకటాల వెనక్కి నెట్టారు. గత కొంతకాలంగా తనపై వస్తున్న అశ్లీల కామెంట్లు, వ్యక్తిగత దూషణలపై రేణు దేశాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇటీవల సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగిస్తూ, అసభ్య పదజాలంతో వేధిస్తున్న నాలుగు సోషల్ మీడియా అకౌంట్లపై ఆమె ఫిర్యాదు చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు, సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను గుర్తించి ఇద్దరిని అరెస్ట్ చేశారు. మిగిలిన ఇద్దరి కోసం గాలింపును మరింత వేగవంతం చేశారు. కేవలం రేణు దేశాయ్ మాత్రమే కాకుండా, నటి అనసూయను వేధించిన కేసులోనూ ఒకరిని పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నారు. "చీకట్లో ఉండి ఫేక్ అకౌంట్లతో కామెంట్లు చేస్తే ఎవరూ పట్టుకోలేరని అనుకోవద్దు.. మీరు ఎక్కడున్నా సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకుంటాం" అంటూ సైబరాబాద్ పోలీసులు కేటుగాళ్లకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. సెలబ్రిటీలే కాకుండా సామాన్య మహిళలు కూడా ఇటువంటి వేధింపులకు గురైతే... వెనుకాడకుండా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మహిళలకు పోలీసులు భరోసా ఇచ్చారు.

# 'ఫ్రెష్' కాదు.. కుళ్లిన చికెన్

హైదరాబాద్‌లోని ఏ-1 ఫ్రెష్ చికెన్ మార్ట్‌లో కుళ్లిన 610 కిలోల చికెన్ పట్టివేత

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): హైదరాబాద్‌లో భారీ మొత్తంలో కుళ్లిన చికెన్‌ను పట్టుకున్నారు. ముషీరాబాద్ బాపూజీనగర్‌లోని ఏ-1 ఫ్రెష్ చికెన్ మార్ట్‌లో వారాసిగూడ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పోలీసులు సుమారు 610 కిలోల కుళ్లిన చికెన్‌ను గుర్తించారు. దుకాణ యజమాని షేక్ షకీల్ పాడైన చికెన్‌ను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల సందర్భంగా మాంసం దుర్వాసన రావడంతో పాటు ఎలుకలు, పిల్లులు సంచరించే అపరిశుభ్రత ప్రాంతంలో నిల్వ ఉంచినట్లు గుర్తించారు. దీంతో చికెన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చికెన్ దుకాణం దుకాణ లైసెన్స్‌ను తనిఖీ చేయగా, గడువు ముగిసి ఏడాది దాటినా రెన్యూవల్ చేసుకోలేదని గుర్తించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# రూ.1,650 కోట్ల భూమి సేఫ్

**కాపాడిన హైడ్రా**

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో రూ.1,650 కోట్ల విలువైన 11 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. ఇందులో 2 ఎకరాలు పార్కు కోసం, 5 ఎకరాలు శ్మశాన వాటిక కోసం, 4 ఎకరాల డంప్ యార్డుకు చెందినదిగా ఉంది. రంగరెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ విలేజ్‌లోని సెంట్రల్ పార్కు కాలనీలో పార్కు కోసం 2 ఎకరాలు కేటాయించారు. సర్వే నంబరు 110/1 లో 148 ప్లాట్లతో 16 ఎకరాల మేర సెంట్రల్ పార్కు కాలనీ ఫేజ్-1 పేరుతో 1998లో లే ఔట్ వేశారు. ఇందులో 2 ఎకరాలను పార్కు కోసం కేటాయించగా, మున్సిపల్ అధికారులు పార్కు స్థలంగా హద్దులు నిర్ధారించి ప్రహరీ కూడా నిర్మించారు. పార్కు కోసం కేటాయించిన భూమి తమదంటూ కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేశారు. హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలసి హైడ్రా క్షేత్రస్థాయిలో పరిశీలించింది. 2 ఎకరాల పార్కు స్థలంగా నిర్ధారించింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం పార్కులో తాత్కలికంగా వేసిన షెడ్డులను తొలగించింది.

# మజ్లిస్ ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి: బండి

కరీంనగర్, మార్చి 17 (ఈవార్తలు): పవిత్రమైన అసెంబ్లీ వేదికగా మజ్లిస్ నేతలు వందేమాతరం గేయాన్ని అవమానిస్తే స్పీకర్ ప్రేక్షక పాత్ర వహించడమేమిటని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌నిలదీశారు. రాజ్యాంగ పరిరక్షకులైన గవర్నర్, స్పీకర్, మండలి చైర్మన్ సాక్షిగా మజ్లిస్ నేతలు వందేమాతర గేయాన్ని అవమానించినా ఎందుకు పట్టదని ప్రశ్నించారు. రాష్ట్రపతి, గవర్నర్ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం తప్పనిసరి చేస్తూ 2026లోనే కేంద్రం ఉత్తర్వులిచ్చిన విషయం మర్చిపోయడం సరికాదన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ గేయం ఆలాపాన సమయంలో అసెంబ్లీ నుండి వాకౌట్ చేసిన మజ్లిస్ నేతలకు ఇంతవరకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి మజ్లిస్ దోస్త్ కావడంతో నోటీసులివ్వడానికి భయపడుతున్నట్లు ఉందన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో స్పీకర్ ఇచ్చిన తీర్పుతో శాసన వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. నిండు సభలోనే మజ్లిస్ ఎమ్మెల్యేలు వందేమాతరం అవమానించినా చర్యలు తీసుకోవడం లేదంటే పలు అనుమాలకు తావునిస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మజ్లిస్ నేతలు వందేమాతరంను అవమానిస్తున్నప్పుడు ఆయనతో సహా మంత్రులంతా సభలోనే



ఉన్న ఎందుకు చర్చించ లేదన్నారు. సభ నియమ నిబంధనలను, కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత వారికి ఎందుకు లేదని మండిపడ్డారు. కాంగ్రెస్‌అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పుస్తకాన్ని రోజు చేతిలో పట్టుకుని తిరుగుతున్నా ఇలాంటి విషయాలు తెలుసుకోకపోవడం సిగ్గు చేటన్నారు. రాజ్యాంగానికి అనుగుణంగా ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలనే సోయి ఈ ప్రభుత్వానికి లేకపోవడం బాధకరమన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి రాజ్యాంగ పరిరక్షుడైన గవర్నర్ సమక్షంలోనే ఉల్లంఘన జరిగినా చర్యలు తీసుకోకపోతే ప్రజల్లోకి ఏ సందేశాలు పంపుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించిన మజ్లిస్ ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలకు స్పీకర్‌ఆదేశించాలని సూచించారు.

# ఈవీలకు పూర్తి పన్ను మాఫీ

### 2027 నాటికి మొత్తం ఎలక్ట్రిక్ బస్సులే.. మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): రాష్ట్రంలో కాలుష్య రహిత, ఆధునిక రవాణా వ్యవస్థను నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో రవాణా శాఖ, ఎలెట్స్ టెక్నోమీడియా సంయుక్తంగా నిర్వహించిన 'సెకండ్ నేషనల్ మొబిలిటి సమ్మిట్- 2026'ను ఆయన ప్రారంభించారు. విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 2026 చివరి వరకు 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజులను మాఫీ చేశామని, దీని ద్వారా ఇప్పటికే వాహనదారులకు రూ. 1,000 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 810 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. 2027 నాటికి హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో వీటి సంఖ్యను 2,800కు పెంచడమే లక్ష్యమని తెలిపారు. పెరుగుతున్న ఎలక్ట్రిక్ బస్సులకు సరిపడా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రజా రవాణాలో గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని పెంచడంపై కూడా దృష్టి సారించామని, ఇది ఉద్గారాలను గణనీయంగా తగ్గించి, గాలి నాణ్యతను మెరుగుపరుస్తుందన్నారు. క్లీన్ ఎనర్జీలో భాగంగా 20,000 ఎలక్ట్రిక్ ఆటోలు, 10,000 సీఎన్‌జీ, 10,000 ఎల్‌పీజీ ఆటోలకు కొత్తగా పర్మిట్లు మంజూరు చేశామని వెల్లడించారు. ఢిల్లీ వంటి నగరాల్లో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో ఇంధన పొదుపు, గ్రీన్ ఎనర్జీ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. ముఖ్యమంత్రి



రేవంత్ రెడ్డి 'విజన్ 2047'లో భాగంగా స్మార్ట్ మొబిలిటీ, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామన్నారు. విద్యుత్ వాహనాల పెంపు ద్వారా కాలుష్యాన్ని నివారించేందుకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ నేషనల్ మొబిలిటీ సమ్మిట్ ప్లాట్‌ఫారమ్‌లు ఆవిష్కరణ, అమలును వేగవంతం చేసే భాగస్వామ్యాలను సృష్టించడంలో సహాయపడతాయన్నారు. ఆవిష్కరణలు, క్లీన్ మొబిలిటీ, స్థిరమైన రవాణా వ్యవస్థలకు మద్దతు ఇవ్వడానికి తమ సర్కారు కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే మా ధ్యేయం

**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, వారి సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ, సహనం, సేవాభావం, మానవత్వానికి ప్రతీకమని తెలిపారు. టీయూడబ్ల్యూజే, టీయూడబ్ల్యూజేఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన దావత్-ఏ-ఇఫ్తార్ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ, సమాజంలో అట్టడుగు వర్గాల గొంతుకగా నిలిచే జర్నలిస్టులు కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారు వారధిలా పనిచేస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి



నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ విషయంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

అలాగే ఇళ్ల స్థలాల కేటాయింపు, హెల్త్ కార్డుల మంజూరు వంటి అంశాల్లో కూడా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్కడేషన్ కార్డుల జారీలో కానీ అక్కడేషన్ కమిటీ ఏర్పాటులో కానీ జర్నలిస్టుల అందరి సలహాలు సూచనలు తీసుకొని ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సుల్తాన్ ఉల్ ఉలూమ్ విద్యాసంస్థల సెక్రటరీ జఫర్ జావేద్, పిస్తా హౌస్ సీఈఓ ఎం.ఏ. మజీద్, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామనారాయణ, టీయూడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.ఏ. మజీద్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ అమ్మాయిల ట్రాప్‌లో పడొద్దు: సజ్జనార్



హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): "మీరు ఒంటరిగా ఉంటున్నారా, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మాట్లాడుకోండి" అంటూ అమ్మాయిలు చెబుతున్నట్లుగా ఉన్న వీడియోల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. యువత ఒంటరితనాన్ని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు హనీట్రాప్ చేస్తున్నారని, ఏఐ జనరేటెడ్ వీడియోల ద్వారా ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారని సూచించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా యువతకు సూచన చేశారు. "ఒంటరిగా ఉన్నారా? ఇంకెందుకు ఆలస్యం, ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి. అందమైన అమ్మాయిలు, ఆంటీలతో సరదాగా మాట్లాడండి. మీ రంగు, రూపంతో మాకు పనిలేదు" అంటూ సోషల్ మీడియాలో ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తున్న ఈ యాడ్స్ వెనుక ఉన్నది తీయటి మాటలు కాదని, నిలువునా దోచేసే సైబర్ కేటుగాళ్ల ఉచ్చు అని పేర్కొన్నారు. ఈ వీడియోల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్న అమ్మాయిలు నిజం కాదని, అవన్నీ ఏఐ సాయంతో సృష్టించిన వీడియోలు అని తెలిపారు. మాయమాటలకు బుట్టలోపడి వారు సూచించిన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకుంటే ముప్పు కొనితెచ్చుకున్నట్లేనని హెచ్చరించారు. ఆ లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకోగానే, మీ ఫోన్‌లోని కాంటాక్ట్స్, గ్యాలరీ మొత్తం వారి అధీనంలోకి వెళ్లిపోతాయని అన్నారు. ఇక రాత్రిపూట సరదాగా మాట్లాడదామని వీడియో కాల్ చేస్తే అవతలి వైపు న్యూడ్ వీడియోలు ప్లే చేసి, స్క్రీన్‌పై ఉన్న మీ ముఖాన్ని రికార్డ్ చేస్తారని, ఆ తర్వాత దాన్ని మార్ఫింగ్ చేసి, మీ కాంటాక్ట్ లిస్ట్‌లోని బంధుమిత్రులకు పంపుతామంటూ బ్లాక్‌మెయిలింగ్ కు దిగుతారని హెచ్చరించారు. పరువు పోతుందన్న భయంతో వారు అడిగినంత ఇచ్చుకుంటూ పోతే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవ్వడం ఖాయమని సజ్జనార్ పేర్కొన్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మోసపూరిత ప్రకటనలు ఇస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎవరూ మీకు ఊరికే స్నేహితులు కాబోరని, ఆ ఆకర్షణ వెనుక మీ డబ్బు, పరువు లాగేసే భారీ కుట్ర దాగి ఉందని గ్రహించాలని అన్నారు. క్షణికావేశంలో గుర్తుతెలియని ఫేక్ డేటింగ్, వీడియో కాలింగ్ యాప్స్ ఇన్‌స్టాల్ చేసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. రాత్రి వేళల్లోనే ఈ యాడ్స్ దర్శనమిస్తున్నాయని... జాగ్రత్తగా ఉండండని యువతకు సూచన చేశారు. ఒకవేళ ఇప్పటికే ఎవరైనా ఇలాంటి సైబర్ వలలో చిక్కుకుంటే, పరువుపోతుందేమో అని భయపడవద్దని, వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయండి లేదా హ్ట్ట్ప్://ఌఎవతీఌతీఅఎవ.స్త్రశీజ.అఅ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

# కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం కుదరడం లేదు: కూనంనేని

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం పనులు చేస్తున్నా ప్రజలు ఎందుకో నమ్మడం లేదని సీపీఐ ఎమ్మెల్యే సాంబశివరావు అన్నారు. అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ప్రభుత్వం ప్రజల కోసం పథకాలు అమలు చేస్తున్నా ప్రజల్లో పెద్దగా నమ్మకం కుదరడం లేదన్నారు. అయితే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అమలు చేయలేని హామీలు ఇచ్చిందని.. వాటన్నింటినీ అమలు చేయకపోవడం వల్లనే ప్రజల్లో ఆ వ్యతిరేకత కనిపిస్తున్నదని



అభిప్రాయపడ్డారు. పడిపోతున్న ప్రభుత్వాన్ని తాము వెన్నంటి ఉంటూ నిలబెడుతున్నామని వ్యాఖ్యానించారు. మిత్రపక్షంగా ఉంటూ తమ టాస్క్‌ను తాము నిర్వహిస్తున్నామని చెప్పారు.




# 61 వేల మంది రైతులకు ఫార్మర్ కిట్స్

**ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లుదాం.. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు సచివాలయ ప్రాంగణం నుండి నిర్వహించిన 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్ 86వ ఎపిసోడ్ ద్వారా గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎంపిక చేసిన రంగరెడ్డి జిల్లాకు చెందిన రైతులకు ప్రత్యేక 'ఫార్మర్ కిట్లను' అందజేసి రాష్ట్రవ్యాప్తంగా లాంఛనంగా ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయమే శ్రీరామరక్ష: ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకం వల్ల మానవ ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, క్యాన్సర్ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు వాతావరణం కలుషితమవుతున్న తరుణంలో, మన పూర్వీకులు ఆచరించిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులే రైతులకు, సమాజానికి క్షేమకరమని ఆయన నొక్కి చెప్పారు. 61,125 మంది రైతులకు కిట్ల పంపిణీ: రాష్ట్రవ్యాప్తంగా 489 క్లస్టర్లను గుర్తించి, ఒక్కో క్లస్టర్ నుండి 125 మంది చొప్పున మొత్తం 61,125 మంది రైతులను ఈ పథకం కోసం ఎంపిక చేశారు. వీరికి అవగాహన తో పాటుగా ఫార్మర్ కిట్లను అందజేశారు. ప్రకృతి వ్యవసాయంపై "క్షేత్ర దర్శిని" పుస్తకం, క్లాత్ బ్యాగ్, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ మరియు చిన్న డైరీ. మార్చి 20, 21, 22 తేదీల్లో ప్రభుత్వం నిర్వహించనున్న 'రైతు మహోత్సవ' కార్యక్రమానికి రైతులు భారీగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కె.సురేంద్రమోహన్ ఐఏఎస్ తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి, బి. గోపి ఐఏఎస్ వ్యవసాయ సంచాలకులు వ్యవసాయ శాఖ తెలంగాణ పాల్గొన్నారు.

# బీజేపీ కార్యకర్తలపై వరుస దాడులు

**డీజీపీకి రాంచందర్ రావు ఫిర్యాదు**

హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): రాష్ట్రంలో బీజేపీ కార్యకర్తలపై జరుగుతున్న వరుస దాడులను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు నేడు డీజీపీ శివధర్ రెడ్డిని కలిశారు. పోలీస్ యంత్రాంగం అధికార పక్షానికి కొమ్ముకాస్తోందని ఆరోపిస్తూ ఆయన డీజీపీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేకనే కక్షపూరితంగా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. పోటీ చేయవద్దని హెచ్చరించినా ధైర్యంగా నిలబడిన బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులే కాకుండా, సాక్షాత్తూ పోలీసులే దాడులకు పాల్పడటం దారుణమని ధ్వజమెత్తారు. గతంలో నల్గొండ ఎస్పీ, నిన్న పరిగి సీఐ బీజేపీ కార్యకర్తలపై భౌతిక దాడులు చేసిన ఘటనలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. హోం శాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ అరాచకాలపై తక్షణమే స్పందించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు.

## జగిత్యాల జిల్లాలో యూట్యూబర్ దారుణ హత్య

కోరుట్ల, మార్చి 17 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. యూట్యూబర్ వైష్ణవిని భర్త హరిబాబు హత్య చేశాడు. ఈ విషాదకర సంఘటన కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రెండేళ్ల క్రితం చిత్తారి హరిబాబును వైష్ణవి ప్రేమ వివాహం చేసుకుంది. సోమవారం రాత్రి హరిబాబు, వైష్ణవి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో విచక్షణ కోల్పోయిన హరిబాబు.. గర్భిణి అయిన వైష్ణవిపై కత్తితో దాడి చేసి చంపేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తిరుమలలో బీఆర్ నాయుడి అనుచరుల బూతులు: భూమన

తిరుమల, మార్చి 17 (ఈవార్తలు): తిరుమల పవిత్రతను కాపాడాల్సిన టీటీడీ చైర్మన్ పదవిలో బీఆర్ నాయుడు కొనసాగడం హిందూ సమాజానికే అవమానమని వైసీపీ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ప్రస్తుతం తిరుమల అరాచక శక్తులు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అసాంఘిక శక్తులను ప్రోత్సహించడమే కాకుండా, సామాన్య భక్తులకు అందాల్సిన రూ.300 టికెట్లను కూడా తన అనుచరులకు, ఆకు రౌడీలకు కట్టబెడుతున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ అరాచకాలను ప్రశ్నిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన వైఎస్సీపీ మహిళా కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించడం దారుణమని ధ్వజమెత్తారు. ఆధ్యాత్మిక వైభవం వెల్లివిరియాల్సిన చోట, నాయుడి అనుచరుల బూతులు వినిపిస్తున్నాయని దుయ్యబట్టారు. బీఆర్ నాయుడికి సంబంధించి బయటకు వచ్చిన వీడియోల వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ... అటువంటి వ్యక్తి చైర్మన్‌గా ఉండటం వల్ల టీటీడీ విశిష్టత దెబ్బతింటోందని, ప్రభుత్వం వెంటనే ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అసాంఘిక శక్తులపై 50 ఏళ్ల క్రితమే పోరాటం చేసిన చరిత్ర తనదని చెప్పారు.

## జగన్.. దమ్ముంటే మద్దతివ్వు

**సీఈసీ అభిశంసన తీర్మానంపై షర్మిల**

విజయనగరం, మార్చి 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రజల సమస్యలపై జగన్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్వర్‌పై 'ఇండియా' కూటమి ప్రతిపాదించిన అభిశంసన తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సవాల్ విసిరారు. విజయనగరం జిల్లా జామిలో పర్యటించిన ఆమె, ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ ను డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఈవీఎంలు మార్చేశారంటూ వైసీపీ నేతలు ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దానిపై నిజాయతీ ఉంటే తమ ఎంపీలతో అభిశంసన తీర్మానంపై సంతకాలు చేయించాలని షర్మిల అన్నారు. "రాష్ట్రంలో ఈవీఎంలు మారిపోయాయని దొంగ ఏడుపులు ఏడ్చారు కదా. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఇండియా కూటమి పెట్టే తీర్మానానికి మద్దతు ప్రకటించాలి. మోదీకి దత్తపుత్రుడు కాదని నిరూపించుకోవాలి" అని ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ ఎన్నికల సంఘాన్ని తన గుప్పిట్లో పెట్టుకున్నారని, రాజ్యాంగ విరుద్ధంగా నడిపిస్తున్నారని షర్మిల ఆరోపించారు. జగన్‌కు నిజంగా ధైర్యం ఉంటే, వైసీపీ ఎంపీల మద్దతును వెంటనే ప్రకటించాలని ఆమె స్పష్టం చేశారు.

## మోదీయే దేశానికి సంరక్షకుడు

న్యూఢిల్లీ: బీజేపీ నేత, పిలిభిత్ ఎంపీ వరుణ్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. దేశానికి, దేశ ప్రజలకు మోదీయే నిజమైన సంరక్షకుడు అని ఆయన అభివర్ణించారు. ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రధాని మోదీని కలిసిన వరుణ్, ఈ భేటీ తనకు లభించిన గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. ఈ సమావేశం అనంతరం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు. "గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీని నా కుటుంబంతో కలిసి కలవడం, ఆయన ఆశీస్సులు, మార్గనిర్దేశం పొందడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని వరుణ్ గాంధీ తన పోస్టులో రాశారు. ప్రధాని మోదీ వ్యక్తిత్వాన్ని, నాయకత్వాన్ని కొనియాడుతూ, "మీ వ్యక్తిత్వంలో అద్భుతమైన పితృ వాత్సల్యం, రక్షణ భావన ఉన్నాయి. మీతో భేటీ అయిన తర్వాత, మీరే ఈ దేశానికి, ప్రజలకు నిజమైన సంరక్షకుడనే నా నమ్మకం మరింత బలపడింది" అని వరుణ్ గాంధీ పేర్కొన్నారు. 1980లో సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత కాంగ్రెస్ పార్టీతో, గాంధీ కుటుంబంలోని ఇతర సభ్యులతో తీవ్ర విభేదాలు రావడంతో మేనకా గాంధీ ఆ పార్టీకి దూరమయ్యారు. ఆ తర్వాత చాలా ఏళ్లకు 2004లో ఆమె తన కుమారుడు వరుణ్‌తో కలిసి బీజేపీలో అధికారికంగా చేరారు. "దేశ ప్రయోజనాల దృష్ట్యా బీజేపీలో చేరడమే సరైన నిర్ణయమని భావిస్తున్నాను" అని ఆ సమయంలో వరుణ్ గాంధీ వ్యాఖ్యానించారు. అనంతరం బీజేపీలో ఆయన కీలక నేతగా ఎదిగారు. 2012లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు.



## భారీగా ఎయిరిండియా సర్వీసులు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని యూరప్, ఉత్తర అమెరికాకు అదనపు విమాన సర్వీసులను నడపనున్నట్లు ఎయిరిండియా మంగళవారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో కీలక మార్గాల్లో వేల సంఖ్యలో అదనపు సీట్లు అందుబాటులోకి రానున్నాయి. వివరాల్లోకి వెళితే... ఈ నెల 19 నుంచి 28 మధ్య ఢిల్లీ, ముంబైల నుంచి లండన్ (హీత్రూ), టొరంటో, ఫ్రాంక్‌ఫర్ట్, జ్యూరిచ్ వంటి ప్రధాన నగరాలకు 36 అదనపు విమానాలను ఆపరేట్ చేయనుంది. ఈ ప్రత్యేక సర్వీసుల ద్వారా దాదాపు 10,000కు పైగా సీట్లను ప్రయాణికులకు అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఇప్పటికే ఈ నెల 10 నుంచి 18 వరకు 78 అదనపు సర్వీసులను నడిపినట్లు ఎయిరిండియా గుర్తుచేసింది. ప్రస్తుత భౌగోళిక, రాజకీయ పరిస్థితుల కారణంగా కొన్ని విమానయాన మార్గాలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ గగనతలాన్ని మూసివేయడంతో విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఎయిరిండియా సుదూర విమానాల సిబ్బంది విధివిధానాల్లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తాత్కాలికంగా కొన్ని సడలింపులు ఇచ్చింది. మరోవైపు ఇండిగో సంస్థ కూడా ఈ నెల 16 నుంచి 28 మధ్య పశ్చిమాసియాకు 252 వీక్లీ విమానాలు నడుపుతున్నట్లు గత వారం ప్రకటించింది. అయితే దోహా, కువైట్, బ్రహెయిన్ వంటి కొన్ని గల్ఫ్ దేశాలకు మాత్రం సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ అదనపు విమానాలకు సంబంధించిన బుకింగ్‌లను తమ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో పాటు అధీకృత ఏజెంట్ల ద్వారా దశలవారీగా ప్రారంభిస్తున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది.



## 24 గంటల్లో పార్సిల్ డెలివరీ!

**6 మెట్రో సిటీల్లో తపాలా సేవలు ప్రారంభం.. మూడు రకాల సేవలు అందుబాటులోకి**

న్యూఢిల్లీ/హైదరాబాద్, మార్చి 17 (ఈవార్తలు): ఇండియా పోస్ట్ వినియోగదారుల కోసం సరికొత్త, వేగవంతమైన సేవల్ని కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్ర సమాచారశాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కలిసి న్యూఢిల్లీలోని గ్యారెంటీడ్ నెక్స్ట్ డే డెలివరీ సేవల్ని ప్రారంభించారు. పత్రాల కోసం 24 స్పీడ్ పోస్ట్, వస్తువుల ఫాస్టెస్ట్ డెలివరీ కోసం 24 స్పీడ్ పోస్ట్ పార్శిల్, నిర్ణీత సమయంలో డెలివరీ చేసే సేవల కోసం 48 స్పీడ్ పోస్ట్ కేటగిరీలను ప్రారంభిస్తూ.. తొలివిడతలో ఆరునగరాల్లో ఈ ఫెసిలిటీని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్ కతా వంటి నగరాల్లో ఈ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 24 గంటల్లో ఇండియా పోస్ట్ డెలివరీ సేవలు ప్రారంభించడం ద్వారా 30 కోట్లమంది ఈ-కామర్స్ వినియోగదారులకు తపాలా సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వర్చువల్‌గా ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం హైదరాబాద్‌లోని కింగ్ కోఠిలో గల భారతీయ విద్యాభవన్స్ కళాశాల ఆడిటోరియంలోనూ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వీణా కుమారి డెర్మల్ మాట్లాడుతూ.. ఈ కొత్త సేవలు పోస్టల్ సేవల చరిత్రలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎంఎస్ సుమితా అయోధ్య, హెడ్‌క్వార్టర్స్ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎన్ఆర్ విశాలాక్షి, తెలంగాణ సర్కిల్ పోస్టల్ అకౌంట్స్ డైరెక్టర్ సంపర్, హెడ్‌క్వార్టర్స్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ రిప్పన్ దుల్లెట్, హెచ్ఆర్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ వై నరేష్ తదితరులు పాల్గొన్నారు.



## డిజిటల్ భవితకు సీ-డాక్: ఎస్ కృష్ణన్

న్యూఢిల్లీ: అత్యున్నత స్థాయి కంప్యూటింగ్, సైబర్ భద్రత, సెమీకండక్టర్ సాంకేతికతలు, ఇతర అధునాతన డిజిటల్ రంగాల్లో దేశ సమర్థతను మెరుగుపరచడంలో అధునాతన కంప్యూటింగ్ అభివృద్ధి కేంద్రం (సీ-డాక్) కీలక పాత్ర పోషిస్తోందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్ అన్నారు. సీ-డాక్ 39వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా వర్చువల్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న ఆయన.. జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్, జాతీయ సెమీకండక్టర్ మిషన్, జాతీయ క్వాంటం మిషన్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో సీ-డాక్ సేవలను వివరించారు. అత్యాధునిక పరిశోధన, మౌలిక సదుపాయాల ద్వారా ఎన్నో ఏళ్లుగా ఈ సంస్థ దేశ వైజ్ఞానిక, డిజిటల్ వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలిపారు. ఆపరేటింగ్ సిస్టంలు, డేటా బేస్‌ల వంటి మౌలిక సాంకేతికతల్లో స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చిన ఆయన.. క్వాంటం కంప్యూటింగ్, ఆర్ఐఎస్సీ-వి, బ్లాక్ చెయిన్, ఐవోటీ వంటి అధునాతన రంగాలపై దృష్టిపెట్టడం అత్యావశ్యకమని వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ ఎస్ సోమనాథ్ మాట్లాడుతూ.. దేశ అంతరిక్ష, డిజిటల్ సామర్థ్యాలను పెంపొందించడంలో సీ-డాక్ అత్యంత కీలక పాత్ర పోషించిందన్నారు. పరమ్ సిరీస్ ద్వారా సూపర్‌కంప్యూటింగ్‌లో సంస్థ బలమైన పరంపరనూ, అలాగే అంతరిక్ష కార్యక్రమాల కోసం కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్ వ్యవస్థల అభివృద్ధిలో ఇస్రోతో సీ-డాక్ సహకారాన్ని కొనియాడారు.

## 'ఫ్యాక్ట్ చెక్'తోనే కచ్చితమైన వార్త

**ఏఐ యుగంలో నిజనిర్ధారణకు ప్రాధాన్యం**
**సంగారెడ్డి కలెక్టర్ పీ ప్రావీణ్య వెల్లడి**
**పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం పాత్ర గొప్పది**
**పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్**
**సంగారెడ్డిలో 'వార్తాలాప్' నిర్వహణ**



సంగారెడ్డి, మార్చి 17 (ఈవార్తలు): ఏది నిజమైన సమాచారం.. ఏది అసలైన వార్త.. వార్తలో నిజమెంత.. ఏది అబద్ధం.. అనే అంశాలే నేటి కృత్రిమ మేధ యుగంలో చాలా కీలకం అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. సమాచారం ఏదైనా నిజనిర్ధారణ చేసుకోవడం అవసరం అని ఆమె చెప్పారు. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ)-హైదరాబాద్ విభాగం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో మంగళవారం వార్తాలాప్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఏఐ ఉపయోగించి తయారు చేసిన కంటెంట్, తప్పుదోవ పట్టించే విజువల్స్, అసత్య సమాచారం తీవ్రమైన సమస్యలుగా పరిణమిస్తున్నాయని తెలిపారు. 'ఒక చిన్న తప్పుడు సమాచారం కూడా సమాజంపై, ఆర్థిక వ్యవస్థపై, ప్రజల నమ్మకంపై ప్రతికూల ప్రభావం చూపిస్తోంది. వార్తాలాప్ తరహా శిక్షణ కార్యక్రమాలు జర్నలిస్టుల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుస్తాయి' అని అన్నారు. పీఐబీ ఏడీజీ శ్రుతిపాటిల్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధ వినియోగం బాగా పెరిగిన ఈ రోజుల్లో వార్తల్లోని నిజనిర్ధారణలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం కీలకంగా వ్యవహరిస్తోందని తెలిపారు. 'రిపోర్టింగ్ ప్రమాణాలను వార్తాలాప్ కార్యక్రమం మెరుగుపరుస్తుంది' అని చెప్పారు. వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన కచ్చితమైన, అధికారిక సమాచారాన్ని ప్రసారం చేయడంలో పీఐబీ పోషిస్తున్న పాత్రను వివరించారు. లింగ సమానత్వం, మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి సీనియర్ జర్నలిస్టు సజయ కాకర్ల వివరించారు. లింగ సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని, ఈ తరహా ఆలోచనాధోరణిని పెంపొందించడంలో తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇలాంటి సమస్యలపై వార్తల ద్వారా అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందని వివరించారు. నోట్‌బుక్ ఎల్ఎల్ఎం, చాట్‌జీపీటీ, గూగుల్ పిన్ పాయింట్, ఎలెవన్ ల్యాబ్స్, జెమినీ ఏఐతో సహా జర్నలిజంలో ఏఐ సాధనాల వినియోగం గురించి సత్యప్రియ వివరించారు. తప్పుడు సమాచారాన్ని గుర్తించి, తమ రిపోర్టింగులో కచ్చితత్వాన్ని పెంపొందించుకొనేందుకు ఆధునిక సాంకేతికతలను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలన్నారు. అలాగే ఏఐ వేదికల ద్వారా వ్యక్తిగతమైన, సున్నితమైన అంశాలను పంచుకోవద్దని హెచ్చరించారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు130 మంది పాత్రికేయులు పాల్గొన్నారు.



## గొల్ల మారమ్మ జాతర ప్రారంభం

కాకినాడ, మార్చి 17 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలం శ్రీరాంపురంలో శ్రీ గొల్ల మారమ్మ అమ్మవారి జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అభిషేకాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. పరిసరాల ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నాయకులు, అధికారులు, పోలీసులు, భద్రత ఏర్పాట్లు చేశారు. తాగునీరు, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచారు.

## బాబు ఎందుకు చేయలేకపోతున్నారు?

**ప్రజల్లో ఇదే చర్చ జరుగుతోంది**
**కూటమి సర్కారుపై జగన్ మండిపాటు**



తాడేపల్లి, మార్చి 17 (ఈవార్తలు): వైసీపీ ఐదేళ్ల పాలనకు, ప్రస్తుత చంద్రబాబు పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు కోవిడ్ వంటి కష్టాలు ఎదురైనా, ఆర్థిక ఒత్తిళ్ల మధ్య కూడా ఇచ్చిన మాట తప్పకుండా సంక్షేమ పథకాలను క్యాలెండర్ ప్రకారం అమలు చేశామని గుర్తు చేశారు. సుమారు రూ. 2.7 లక్షల కోట్లను నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి చేరవేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే అప్పులు రూ. 3.30 లక్షల కోట్లు దాటాయని విమర్శించారు. జగన్ చేయగలిగింది బాబు ఎందుకు చేయలేకపోతున్నాడు? అనే చర్చ ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ జరుగుతోందని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 'దోచుకో.. పంచుకో.. తినుకో..' అనే విధానం సాగుతోందని, అమరావతి పనుల్లో విచ్చలవిడిగా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రావడం లేదని, ఆర్థిక పరిస్థితి అధ్వానంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అవినీతి కోసమే వారు అధికారంలో ఉన్నారని, ఎన్నికల హామీలను గాలికొదిలేశారని మండిపడ్డారు. వైసీపీకి 'గుండె ధైర్యం' అనేది ఒక ట్రేడ్ మార్క్ అని, విలువలు, విశ్వసనీయతే పార్టీకి పునాదులని అన్నారు. ఈ భేటీలో బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి ముఖ్య నేతలు పాల్గొన్నారు.

**పార్లమెంట్ చరిత్రలోనే పట్టుబడ్డ తొలి ఎంపీ పుట్ట**

పార్లమెంట్ చరిత్రలోనే డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ మొదటి ఎంపీ టీడీపీకి చెందిన పుట్టా మహేశ్ అని జగన్ విమర్శించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే రాష్ట్రంలో డ్రగ్స్ దందా విచ్చలవిడిగా సాగుతోందని మండిపడ్డారు. బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు పట్టుబడినప్పుడు కూడా ప్రభుత్వం మౌనంగా ఉండిపోయిందని జగన్ దుయ్యబట్టారు. కేవలం డ్రగ్స్ మాత్రమే కాకుండా, మహిళలపై జరుగుతున్న దాడుల విషయంలోనూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. కోనేటి ఆదిమూలం వంటి వారు మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినా, కూన రవికుమార్ వంటి వారు వేధింపులకు దిగినా చర్యలు లేవని, కేవలం కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని ఫైర్ అయ్యారు. చంద్రబాబు మైండ్‌సెట్ వల్లే రాష్ట్రంలో ఇన్ని అరాచకాలు జరుగుతున్నాయని జగన్ దుయ్యబట్టారు. తప్పు చేసిన వాళ్లపై చంద్రబాబు చర్యలు తీసుకోలేదని... అందుకే దురాగతాలు పెరుగుతున్నాయని విమర్శించారు. "అమ్మాయిలకు ముద్దైనా పెట్టాలి, కడుపైనా చేయాలి" అని బాలకృష్ణ వ్యాఖ్యలు చేశారని, గతంలో చంద్రబాబు కూడా కొన్ని వ్యాఖ్యలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయ్యాయని, ఇక మిగిలింది కేవలం రెండేళ్లేనని, చివరి ఏడాది ఎన్నికలు జరుగుతాయని జగన్ అన్నారు. ఈ మధ్యలో తాను పాదయాత్ర కూడా చేపడతానని తెలిపారు. 'జగన్ 2.ా' లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని, వారి ద్వారానే ప్రజలకు మరింత చేరువవుతామని స్పష్టం చేశారు.

## ఏపీలో 164 మందికి కళారత్న, ఉగాది పురస్కారాలు

అమరావతి, మార్చి 17 (ఈవార్తలు): పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఏపీ ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించింది. కళారత్న అవార్డులకు 40 మందిని, ఉగాది పురస్కారాలకు 124 మందిని.. మొత్తంగా 164 మందిని ఎంపిక చేసింది. సాహిత్య విభాగంలో మన్నవ సత్యనారాయణ, ఆర్.ఎ.పద్మనాబ రావు, నాగభైరవ ఆదినారాయణ, వెంకట సూర్యారావు, సుందరం, నారాయణరావు, కామేశ్వరరావు కళారత్న అవార్డులకు ఎంపికయ్యారు. గురువారం జరిగే ఉగాది వేడుకల్లో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు.

## ఏపీ ఈఏపీసెట్ గడువు పొడిగింపు

విజయవాడ, మార్చి 17 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, వ్యవసాయం, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ ఈఏపీసెట్-2026 దరఖాస్తు గడువును అధికారులు పొడిగించారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులకు ఇది ఊరటనిచ్చే వార్త. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సెట్ కన్వీనర్ మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం వివిధ దశల్లో ఆలస్య రుసుముతో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు. రూ.1,000 ఆలస్య రుసుముతో మార్చి 28 వరకు, రూ.2,000 ఆలస్య రుసుముతో ఏప్రిల్ 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

## నేటి నుంచి జూన్ శ్రీవారి దర్శన టికెట్ల కోటా విడుదల

తిరుమల, మార్చి 17 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం అందించింది. 2026 జూన్ నెలకు సంబంధించిన వివిధ దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, వసతి గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేసేందుకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ప్రకటించింది. శ్రీవారి దర్శనానికి ప్లాన్ చేసుకునే భక్తులు ఈ తేదీలను గమనించి, ముందుగానే టికెట్లు బుక్ చేసుకోవాలని సూచించింది. భక్తులు ,నవఝుర్ట్ఘుఖుఎం.ఖజూ.న్రశీజ.ఱఅ అనే అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ అధికారులు విజ్ఞప్తి చేశారు.

**మార్చి 18:**

సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవా టికెట్ల కోసం ఉదయం 10 గంటలకు ఎలక్ట్రానిక్ డిప్ రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుంది.

ఈ డిప్ కోసం మార్చి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. టికెట్లు పొందిన వారు మార్చి 22 మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బు చెల్లించి ఖరారు చేసుకోవాలి.

**మార్చి 21:**

ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, జ్యేష్ఠాభిషేకం టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను అందుబాటులో ఉంచుతారు.

**మార్చి 23:**

ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేస్తారు.

ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్ల ఆన్‌లైన్ కోటాను విడుదల చేస్తారు.

మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను విడుదల చేస్తారు.

**మార్చి 24:**

ఉదయం 10 గంటలకు రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను విడుదల చేస్తారు.

మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

# ఇరాన్- ఇజ్రాయెల్ యుద్ధంతో మనకేం సంబంధం?

**అమెరికా కీలక అధికారి అసహనం.. రాజీనామా**

వాషింగ్టన్: ఇరాన్‌పై డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ఈ యుద్ధానికి మద్దతు ఇవ్వలేనంటూ అమెరికాకు చెందిన కీలక అధికారి ఒకరు రాజీనామా చేశారు. అమెరికా జాతీయ ఉగ్ర నిరోధక కేంద్రం డైరెక్టర్‌గా ఉన్న జో కెంట్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ మన దేశానికి తక్షణ ముప్పు ఏమీ కలిగించలేదని అన్నారు. ఇజ్రాయెల్ ఒత్తిడి కారణంగానే ఈ యుద్ధం ప్రారంభమైందని అన్నారు. యుద్ధం కోసం ఇజ్రాయెల్‌తో పాటు దాని శక్తిమంతమైన అమెరికన్ లాబీ నుంచి ఒత్తిడి వచ్చిందని ఆరోపించారు. తాను చాలా ఆలోచించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం 18వ రోజుకు చేరుకుంది. ఒకవైపు హర్మూజ్‌ను రక్షించడానికి అన్ని దేశాలు కలిసి రావాలని ట్రంప్ విజ్ఞప్తి చేస్తుండగా, ఎవరూ ముందుకు రావడం లేదు. ఇలాంటి తరుణంలో కీలక అధికారి రాజీనామా చేయడం గమనార్హం. ఈ మేరకు జో కెంట్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లేఖ రాశారు. మూడు అధ్యక్ష ఎన్నికల సందర్భంగా మీరు ప్రచారం చేసిన విలువలకు, మొదటి హయాంలో అమలు చేసిన విదేశాంగ విధానాలకు మద్దతుగా ఉన్నానని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ యుద్ధాలు మన పౌరులు, సైన్యం ప్రాణాలు తీయడంతో పాటు దేశ సంపదను క్షీణింపజేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. కానీ ఇటీవల ఉన్నతస్థాయి ఇజ్రాయెల్ అధికారులు, అమెరికన్ మీడియాలోని ప్రభావవంతమైన కొందరు వ్యక్తులు ఇరాన్ విషయంలో తప్పుడు ప్రచారాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఇది 'అమెరికా ఫస్ట్' అనే నినాదాన్ని దెబ్బతీసి, ఇరాన్‌తో యుద్ధానికి వెళ్లేలా చేసిందని వాపోయారు. ఇరాన్ అణుకేంద్రాలు అమెరికాకు తక్షణ ముప్పుగా పరిణమించిందని, ఇప్పుడు దాడి చేస్తే విజయం సాధించవచ్చని నమ్మించారని ఆరోపించారు. గతంలో ఇరాక్, ఇప్పుడు ఇరాన్ యుద్ధంలోకి అమెరికన్లను లాగడానికి



ఇజ్రాయెల్ ఎత్తుగడలు వేసిందని అన్నారు. ఇలాంటి తప్పులను అమెరికా ప్రభుత్వం మళ్లీ చేయవద్దని కోరారు. 11 సార్లు యుద్ధానికి వెళ్లిన ఒక సైనికుడిగా, ఇజ్రాయెల్ సృష్టించిన యుద్ధంలో భార్యను కోల్పోయిన వ్యక్తిగా చెబుతున్నానని, ఇజ్రాయెల్ సృష్టించిన యుద్ధాలు అమెరికాకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చవని పేర్కొన్నారు. ఇలాంటి యుద్ధాలకు అమెరికన్ పౌరులను పంపించడాన్ని తాను సమర్థించలేనని అన్నారు. మనం ఇరాన్‌లో ఏం చేస్తున్నాం, ఎవరి కోసం చేస్తున్నామో పునరాలోచించుకోవాలని ట్రంప్‌కు రాసిన లేఖలో కెంట్ పేర్కొన్నారు.

# మళ్లీ ఈ-కేవైసీ అవసరం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్‌కు మళ్లీ ఈ-కేవైసీ చేయించాలంటూ వస్తున్న వార్తలపై నెలకొన్న గందరగోళానికి కేంద్ర ప్రభుత్వం తెరదించింది. ఈ-కేవైసీ ప్రక్రియ అందరికీ తప్పనిసరి కాదని, కేవలం కొందరికి మాత్రమేనని కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసి వినియోగదారుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించే ప్రయత్నం చేసింది. ఇప్పటికే కేవైసీ పూర్తి చేసుకున్న సాధారణ వినియోగదారులు మళ్లీ ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం లేదని కేంద్రం తెలిపింది. కేవలం ఇప్పటివరకు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ (ఈ-కేవైసీ) పూర్తి చేయని వారు, ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులు మాత్రమే దీన్ని చేయాల్సి ఉంటుందని వివరించింది. ఉజ్వల పథకం కింద కనెక్షన్ పొందిన వారు సబ్సిడీ ప్రయోజనాలు కొనసాగడానికి ప్రతి ఆర్థిక సంవత్సరం తప్పనిసరిగా కేవైసీ చేయించుకోవాలని పేర్కొంది. ముఖ్యంగా 7 సిలిండర్ల తర్వాత 8, 9వ




సిలిండర్ రీఫిల్‌పై సబ్సిడీ పొందడానికి ఇది అవసరమని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి మీదుగా ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ప్రభావంతో దేశంలో ఎల్‌పీజీ నిల్వలు తగ్గడంతో కేంద్రం వాణిజ్య సిలిండర్లపై ఆంక్షలు విధించి గృహ వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చింది. సిలిండర్ల బ్లాక్ మార్కెట్‌ను నిరోధించేందుకు బుకింగ్ గడువును 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. ఇందులో భాగంగానే ఈ-కేవైసీపైనా ఆదేశాలు జారీ చేయడంతో వినియోగదారులందరూ మళ్లీ కేవైసీ చేయించాలనే అపోహతో గ్యాస్ ఏజెన్సీల వద్ద బారులు తీరారు. ఈ-కేవైసీ ప్రక్రియను వినియోగదారులు తమ ఇళ్ల నుంచే ఆన్‌లైన్‌లో ఉచితంగా పూర్తి చేసుకోవచ్చని మంత్రిత్వ శాఖ తెలిపింది. దీనివల్ల పారదర్శకత పెరగడమే కాకుండా నకిలీ కనెక్షన్లను గుర్తించడం, బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడం సులభమవుతుందని వివరించింది. ఎలాంటి అంతరాయం లేకుండా సిలిండర్ల సరఫరా జరుగుతుందని హామీ ఇచ్చింది. మొత్తం మీద, కేంద్రం చేసిన ఈ తాజా ప్రకటనతో గ్యాస్ వినియోగదారుల్లో నెలకొన్న ఆందోళన, గందరగోళానికి తెరపడినట్లయింది.

# భవానీపూర్ బరిలో మమత

**మరోసారి దీదీ - సువేందు అధికారి పోరు**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలు వేడెక్కాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్ నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో, బీజేపీ నేత, ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారికి, మమతకు మధ్య మరోసారి హోరాహోరీ పోరుకు రంగం సిద్ధమైంది. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పేరును కాషాయదళం అధినాయకత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇప్పుడు మమతా కూడా ఇదే స్థానం నుంచి బరిలో దిగుతుండడంతో అందరి దృష్టి భవానీపూర్ నియోజకవర్గంపైనే ఉండనుంది. గత 2021 ఎన్నికల్లో మమతా బెనర్జీ నందిగ్రామ్ నుంచి పోటీ చేయగా, సువేందు అధికారి ఆమెపై



సుమారు 2,000 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు మమత... భవానీపూర్ నుంచి ఉపఎన్నికలో గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇప్పుడు సువేందు అధికారి నేరుగా భవానీపూర్‌లోనే ఆమెతో తలపడనుండటం రాజకీయంగా ఆసక్తిని రేపుతోంది. రాబోయే ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 291 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను మమత విడుదల చేశారు. మొత్తం 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో, డార్జిలింగ్ పరిధిలోని 3 స్థానాలను మిత్రపక్షమైన బీజీపీఎంకు కేటాయించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తమ పార్టీ 226 కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, రాష్ట్రంలోని కీలక అధికారులను బదిలీ చేయడం దీనికి నిదర్శనమని ఆరోపించారు. బీజేపీ రాష్ట్రంలో ఘర్షణలు సృష్టించేందుకు కుట్ర చేస్తోందని, ఏమైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే ఎన్నికల సంఘానిదే బాధ్యత అని హెచ్చరించారు. టీఎంసీ అభ్యర్థుల జాబితా విడుదలతో బెంగాల్ ఎన్నికల రాజకీయం మరింత రసవత్తరంగా మారింది.

# భారతీయ హిందువులను టార్గెట్ చేయండి

**దాడులకు ఐసిస్ అనుబంధ గ్రూపుల పిలుపు**

న్యూఢిల్లీ: భారత్ సహా దక్షిణాసియా దేశాల్లోని హిందువులే లక్ష్యంగా దాడులకు దిగాలంటూ ఐసిస్ అనుబంధ తీవ్రవాద నెట్‌వర్క్‌లు పిలుపునిచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా నియామకాలను విస్తృతం చేస్తూనే, ఇటీవల అమెరికాలో జరిగిన హింసాత్మక ఘటనలను ప్రశంసిస్తున్నాయని కౌంటర్ ఎక్స్‌ట్రీమిజం ప్రాజెక్ట్ (సీఈపీ) విడుదల చేసిన ఓ తాజా నివేదిక హెచ్చరించింది. సీఈపీ నివేదిక ప్రకారం.. మార్చి 9వ తేదీన ఐసిస్ అనుకూల యూజర్ ఒకరు హిందువులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయాలంటూ ఓ సందేశాన్ని పోస్ట్ చేశారు. ఈ సందేశంలో బంగ్లాదేశ్, మయన్మార్‌తో పాటు భారత్‌లోని పశ్చిమ బెంగాల్, అసోం, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ తర్వాత ఈ పిలుపును 'రాకెట్‌చాట్' వంటి ఇతర ప్లాట్‌ఫామ్‌లలో కూడా షేర్ చేయడంతో తీవ్రవాద నెట్‌వర్క్‌లలో ఇది విస్తృతంగా వ్యాపించింది. అంతేకాకుండా, అమెరికాలో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలను కూడా ఐసిస్ మద్దతుదారులు ఆన్‌లైన్‌లో ప్రశంసించినట్లు నివేదిక తెలిపింది. న్యూయార్క్‌లో మార్చి 7న జరిగిన దాడి యత్నం, మార్చి 12న ఓల్డ్ డొమినియన్ యూనివర్సిటీలో జరిగిన కాల్పుల ఘటనలను వారు వేడుకగా జరుపుకున్నారు. యూనివర్సిటీలో కాల్పులు జరిపిన వ్యక్తిని 'అమరవీరుడు' అంటూ కీర్తించారు. గతంలో ఐసిస్‌కు సహకరించేందుకు ప్రయత్నించిన కేసులో అతడు ఎనిమిదేళ్ల జైలు శిక్ష అనుభవించడం గమనార్హం. వీటితో పాటు, ఆన్‌లైన్ వేదికగా విరాళాలు సేకరించడంతో పాటు, దాడులను ప్రోత్సహిస్తూ మార్చి 8 నుంచి 11 మధ్య ఐసిస్ నాలుగు వీడియోలను కూడా విడుదల చేసింది. మరోవైపు, క్షేత్రస్థాయిలోనూ తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ మార్చి 8 నుంచి 14 మధ్య నైజీరియా, కాంగో, సిరియా, పాకిస్థాన్‌తో సహా పలు దేశాల్లో మొత్తం 24 దాడులకు పాల్పడినట్లు ఆ సంస్థ ప్రకటించుకుంది.

# ఇరాన్ మిలటరీ చీఫ్‌ను చంపేశాం: ఇజ్రాయెల్


జెరూసలెం: ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరాయి. ఇరాన్ భద్రతా వ్యవహారాల చీఫ్ అలీ లారిజానీని హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ మేరకు



ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ అధికారికంగా ధృవీకరించారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలను మరింత దట్టం చేస్తోంది. ఇజ్రాయెల్ మీడియా కథనాల ప్రకారం, రాత్రివేళ ఇరాన్‌లోని సీనియర్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. ఈ దాడిలో లారిజానీతో పాటు ఇరాన్ బసిజ్ పారామిలటరీ దళాల అధిపతి ఘోలంరెజా సొలైమానీ కూడా మరణించినట్లు తెలుస్తోంది. ఇరాన్ నుంచి దీనిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. అలీ లారిజానీ ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఇటీవల అమెరికా-ఇజ్రాయెల్ ఉమ్మడి దాడుల్లో మరణించిన సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీకి ఆయన అత్యంత నమ్మకస్తుడిగా, కుడిభుజంగా పేరుగాంచారు. ఖమేనీ మరణానంతరం ఇరాన్ భద్రతా వ్యవస్థలో లారిజానీ అత్యంత కీలకమైన వ్యక్తిగా మారారు. ఖమేనీ మరణంతో ఇరాన్‌లో ఇప్పటికే తాత్కాలిక నాయకత్వ మండలి పాలన సాగిస్తోంది. ఇలాంటి సమయంలో జరిగిన ఈ దాడి దేశంలో రాజకీయ అస్థిరతను మరింత పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బోనీ కపూర్, జాన్వీ, ఖుషీలకు కోర్టులో ఊరట

చెన్నై: దివంగత నటి శ్రీదేవికి సంబంధించిన ఆస్తి వివాదంలో ఆమె కుటుంబానికి మద్రాస్ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న భూమికి సంబంధించి చెంగల్పట్టు కోర్టులో జరుగుతున్న విచారణపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఈ తాజా పరిణామంతో శ్రీదేవి భర్త, నిర్మాత బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ, ఖుషీ కపూర్‌లకు ఊరట దక్కినట్లయింది. వివరాల్లోకి వెళితే, చెన్నై ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ఉన్న 4.77 ఎకరాల భూమిని శ్రీదేవి 1988లో సంబంధ ముదలియార్ కుటుంబం నుంచి కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఆ ఆస్తి శ్రీదేవి కుటుంబం ఆధీనంలోనే ఉంది. అయితే, చంద్రశేఖరన్ ముదలియార్ రెండో భార్య పిల్లలమని చెప్పుకుంటున్న నటరాజన్, శివగామి మరికొందరు, తాము చట్టబద్ధమైన వారసులమని పేర్కొంటూ ఆ ఆస్తిలో వాటా కోసం చెంగల్పట్టు అదనపు జిల్లా కోర్టులో దావా వేశారు. ఈ దావాను కొట్టివేయాలని కోరుతూ బోనీ కపూర్ కుటుంబం మొదట చెంగల్పట్టు కోర్టును ఆశ్రయించింది. అయితే, పూర్తిస్థాయి విచారణ తర్వాతే యాజమాన్య హక్కులపై నిర్ణయం తీసుకోగలమని పేర్కొంటూ ఆ కోర్టు వారి అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో కపూర్ కుటుంబం మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రత్యర్థులు తప్పుడు పత్రాలతో 2005లో తాంబరం తహసీల్దార్ కార్యాలయం నుంచి వారసత్వ ధ్రువపత్రం పొందారని తమ పిటిషన్‌లో ఆరోపించారు. ముదలియార్ మొదటి భార్య జీవించి ఉండగానే రెండో వివాహం జరిగిందని చెబుతున్నారని, కాబట్టి వారి వారసత్వ వాదన చట్టబద్ధంగా చెల్లదని వాదించారు. ఈ వాదనలు విన్న జస్టిస్ టీవీ తమిళ్‌సెల్వి, చెంగల్పట్టు కోర్టులో తదుపరి విచారణపై మధ్యంతర స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కేసు తదుపరి విచారణను మార్చి 26కి వాయిదా వేశారు. హైకోర్టు తాజా ఉత్తర్వులతో కింది కోర్టులో విచారణకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.



# పవిత్ర గంగానదిలో అపవిత్ర పనులు

**ఇఫ్తార్ విందు.. 14 మంది అరెస్ట్**

వారణాసి: యూపీ, వారణాసిలోని పవిత్ర గంగా నదిలో కొంతమంది యువకులు ఇఫ్తార్ విందు జరుపుకోవడం వివాదంగా మారింది. దీనిపై పలు హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు 14 మందిని అరెస్టు చేశారు. ఇటీవల గంగా నదిపై ఒక బోటులో ఒక వర్గానికి చెందిన యువకులు ఇఫ్తార్ విందు చేసుకున్నారు. గంగా నదిలో బోటుపై ప్రయాణిస్తూ వివిధ పదార్థాలుసహా చికెన్ బిర్యానీ వంటి నాన్ వెజ్ తిన్నారు. పైగా మిగిలిన బిర్యానీ, ఎముకలు వంటి పదార్థాల్ని నదిలోనే పడేశారు. అంతేకాదు.. దీన్నంతటినీ వీడియో తీసుకుని, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పవిత్రంగా భావించే గంగానదిలో విందు చేసుకోవడం, నాన్‌వెజ్‌ను నదిలో పారేయడం ఏంటని కొందరు హిందూ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రజత్ జైశ్వాల్ అనే వ్యక్తి కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇలా చేయడం వల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపారు. విందు చేసుకున్న 14 మందిని గుర్తించి, అరెస్టు చేశారు. మరికొందరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నదిలో బోటుపై విందు చేసుకోవడానికి గల కారణాలపై నిందితుల్ని విచారిస్తున్నారు. పూర్తి విచారణ అనంతరం నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# రష్యాలో చికిత్స మానసిక యుద్ధం: ఇరాన్

టెహ్రాన్: ఇజ్రాయెల్‌తో కలిసి జరిపిన దాడుల్లో ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అయతుల్లా మొజ్తబా ఖమేనీ గాయపడినట్లు అమెరికా చెబుతుండడం తెలిసిందే. ఈ క్రమంలో ఖమేనీకి చికిత్స అందించడం కోసం రష్యా రాజధాని మాస్కోకు తరలించినట్లు కథనాలు వెలువడ్డాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్... ఖమేనీని వ్యక్తిగతంగా ఆహ్వానించారని వార్తలు వచ్చాయి. అయితే ఈ కథనాలను ఇరాన్ కొట్టిపారేసింది. రష్యాలోని ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలీ ఈ వార్తలను తోసిపుచ్చారని 'టాస్' న్యూస్ ఏజెన్సీ తెలిపింది. మొజ్తబా ఖమేనీని చికిత్స కోసం మాస్కోకు తరలించినట్లు కొన్ని కథనాలు వెలువడుతున్నాయని, ఇది కొత్త తరహా మానసిక యుద్ధమని కాజెమ్ జలాలీ పేర్కొన్నారు. ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన అవసరం, దాక్కోవాల్సిన అవసరం లేదని తెలిపారు. వారు ఎప్పుడూ ప్రజల మధ్య ఉంటారని అన్నారు. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ముందు కూడా సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ వెనెజువెలా, రష్యాకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు అసత్య ప్రచారం చేశారని అన్నారు. ఇప్పుడు మొజ్తబా చికిత్స కోసం రష్యా వెళ్ళినట్లు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై స్పందించేందుకు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెష్కోవ్ నిరాకరించారు. ఇజ్రాయెల్, అమెరికా దాడిలో మొజ్తబా తీవ్రంగా గాయపడ్డారని, ఆయన గుర్తుపట్టలేని విధంగా మారిపోయారని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ ఇటీవల తెలిపారు. మొజ్తబా బతికి ఉన్నారా లేదా అనే విషయం తనకు తెలియదని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# పేదల సొమ్మును బ్యాంకులు దోచుకుంటున్నాయ్!

**పార్లమెంట్‌లో గళం విప్పిన ఎంపీ రాఘవ్ చద్దా**

న్యూఢిల్లీ: పార్లమెంట్ వేదికగా ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా 'మినిమం బ్యాలెన్స్' పెనాల్టీల అంశంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బ్యాంకింగ్ వ్యవస్థలో జరుగుతున్న ఈ నిశ్శబ్ద దోపిడీపై ఆయన అందించిన గణాంకాలు విస్తుగొలుపుతున్నాయి. బ్యాంకు ఖాతాల్లో కనీస నిల్వ (మినిమం బ్యాలెన్స్) లేదనే నెపంతో గత మూడేళ్లలో బ్యాంకులు ఏకంగా రూ.19 వేల కోట్లు వసూలు చేశాయని రాఘవ్ చద్దా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భారీ మొత్తం అపర కోటీశ్వరుల జేబుల నుంచి వచ్చింది కాదని, రెక్కాడితే గానీ డొక్కాడని రోజువారీ కూలీలు, రైతులు, తమ మందుల ఖర్చుల కోసం పైసా పైసా పోగేసుకునే పెన్షనర్ల కష్టార్జితమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ బ్యాంకులు రూ.11 వేల కోట్లు, ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.8 వేల కోట్లు ఈ రూపంలో వసూలు చేశాయని దుయ్యబట్టారు. ఈ జరిమానాలను 'పేదరికంపై వేసిన పన్ను'గా ఆయన అభివర్ణించారు. ఒక సామాన్యుడు తన అత్యవసర ఖర్చుల కోసం అకౌంట్ ఖాళీ చేసినప్పుడు, అతనికి అండగా ఉండాల్సిన బ్యాంకులు రివర్స్‌లో వందల రూపాయల పెనాల్టీలు వేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. జన్ ధన్ ఖాతాలకు మినహాయింపు ఉన్నప్పటికీ, కోట్లాది మంది సామాన్య సేవింగ్స్ ఖాతాదారులపై ఈ భారం పడుతోందని ధ్వజమెత్తారు. ఈ పెనాల్టీలను తక్షణమే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐని ఆయన డిమాండ్ చేశారు.

# అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటాం: మొజ్తబా

టెహ్రాన్: అమెరికాతో ఉద్రిక్తతలు తగ్గించుకోవాలంటూ మధ్యవర్తి దేశాల ద్వారా వచ్చిన సంధి ప్రతిపాదనలను ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అయతుల్లా మొజ్తబా ఖమేనీ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకునే విషయంలో ఆయన చాలా దృఢవైఖరితో ఉన్నారని ఓ ఇరాన్ సీనియర్ అధికారి 'రాయిటర్స్'కు వెల్లడించారు. తన నియామకం తర్వాత జరిగిన తొలి విదేశాంగ విధాన సమావేశంలో మొజ్తబా ఈ మేరకు స్పష్టమైన సంకేతాలిచ్చారు. "రక్త ప్రతీకారాన్ని మేం మరిచిపోం. పూర్తి శక్తితో ప్రతిఘటిస్తాం. శత్రువుల నుంచి పరిహారం పొందుతాం లేదా అదే స్థాయిలో వారి ఆస్తులను ధ్వంసం చేస్తాం" అని మొజ్తబా ఖమేనీ హెచ్చరించినట్లు ఆ అధికారి తెలిపారు. ప్రతీకార చర్యలు ఇప్పటికే మొదలయ్యాయని, అవి పూర్తయ్యే వరకు తమ ప్రాధాన్యత అదేనని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో మొజ్తబా తండ్రి, అప్పటి సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడిలో మొజ్తబా కూడా తీవ్రంగా గాయపడ్డారు. కువైట్ వార్తాపత్రిక అల్-జరీదా కథనం ప్రకారం, రష్యా అధ్యక్షుడు పుతిన్ చొరవతో మొజ్తబాను మెరుగైన చికిత్స కోసం మాస్కోకు తరలించారు. అయితే, ఈ వార్తలపై తాము స్పందించబోమని రష్యా తెలిపింది. ఇదిలా ఉండగా, తాజా దాడిలో ఇరాన్ సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజానీ, రెవల్యూషనరీ గార్డ్ బాసిజ్ ఫోర్స్ చీఫ్ జనరల్ ఘోలం రెజా సొలైమానీని చంపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే, ఈ మరణాలను ఇరాన్ అధికారికంగా ధృవీకరించలేదు.

# బాలీవుడ్ అశ్లీలతపై కఠిన నియంత్రణ అవసరం: కంగనా

ముంబై: బాలీవుడ్ తన స్థాయిని దిగజార్చుకుంటూ, ప్రేక్షకులను ఆకర్షించడం కోసం అన్ని హద్దులను దాటేస్తోందని స్టార్ హీరోయిన్, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ ఘాటుగా విమర్శించారు. చౌకబారు ట్రిక్కులతో అశ్లీలతను ప్రోత్సహిస్తున్న సినీ పరిశ్రమ తీరును దేశమంతా ఛీకొడుతున్నా, వారికి ఏమాత్రం సిగ్గు ఉన్నట్లు అనిపించడం లేదని ఆమె మండిపడ్డారు. ఇలాంటి అభ్యంతరకర ప్రదర్శనలకు చెక్ పెట్టాలంటే ప్రభుత్వం బాలీవుడ్‌పై కచ్చితంగా కఠినమైన నియంత్రణ విధించాలని, అప్పుడే ఈ అశ్లీలతకు ఎండ్ కార్డ్ పడుతుందని కంగనా గట్టిగా నొక్కి చెప్పారు. అసలు ఈ వివాదం 'కేడీ.. ది డెవిల్' అనే కన్నడ చిత్రం కోసం రూపొందించిన హిందీ పాటతో మొదలైంది. ఈ పాటలోని సాహిత్యం పచ్చిగా, డబుల్ మీనింగ్ డైలాగులతో ఉందంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. కేవలం సాధారణ ప్రజలే కాకుండా, ప్రముఖ గాయకుడు అర్మాన్ మాలిక్ కూడా కమర్షియల్ సాంగ్ రైటింగ్ ఇంతగా దిగజారిపోవడం బాధాకరమంటూ తన అసహనాన్ని వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో నోరా ఫతేహి నటించిన ఈ పాటను ఇప్పటికే యూట్యూబ్ నుంచి తొలగించారు. అంతేకాకుండా, నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని చిత్ర బృందానికి నోటీసులు జారీ చేయడం గమనార్హం.

# లాభాల్లో సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు లాభాలను నమోదు చేశాయి. మంగళవారం ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదొడుకులు ఎదురైనప్పటికీ, చివరికి సూచీలు లాభాలతోనే ముగిశాయి. రోజంతా లాభనష్టాల మధ్య ఊగిసలాడిన మార్కెట్లకు మెటల్, ఆటో రంగ షేర్లు అండగా నిలిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 568 పాయింట్లు లాభపడి 76,070.84 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 172.35 పాయింట్లు పెరిగి 23,581.15 వద్ద ముగిసింది. నిఫ్టీలో టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎటర్నల్ షేర్లు మంచి లాభాలను ఆర్జించాయి. అయితే, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభాలతోనే ముగియడం సానుకూలాంశం. మార్కెట్‌లో అస్థిరతను సూచించే ఇండియా విక్స్ ఇండెక్స్ 8.39 శాతం తగ్గి 19.79కి చేరడం ఇన్వెస్టర్లకు కొంత ఊరటనిచ్చింది. సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీ 23,600 స్థాయిని దాటితే 23,800-24,000 స్థాయిలకు చేరే అవకాశం ఉంది. అయితే, ఈ స్థాయి వద్ద అమ్మకాల ఒత్తిడి ఎదురుకావచ్చని అంచనా వేస్తున్నారు. ఒకవేళ నిఫ్టీ పడితే, 23,500 వద్ద మొదటి మద్దతు, ఆ తర్వాత 23,300-23,350 వద్ద బలమైన మద్దతు లభించవచ్చని తెలిపారు. అంతర్జాతీయ అనిశ్చితులు ఇంకా కొనసాగుతున్నందున ఇది పూర్తిస్థాయి ట్రెండ్ రివర్సల్ కాదని, కేవలం తాత్కాలిక రికవరీ మాత్రమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# మారుతి సుజుకికి 5,786 కోట్ల పన్ను నోటీసు

ముంబై: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్‌కు ఆదాయపు పన్ను శాఖ నుంచి భారీ పన్ను డిమాండ్ నోటీసు అందింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.5,786 కోట్ల పన్ను చెల్లించాలంటూ ఐటీ శాఖ డ్రాఫ్ట్ అసెస్‌మెంట్ ఆర్డర్‌ను జారీ చేసినట్లు కంపెనీ మంగళవారం వెల్లడించింది. అయితే, ఈ నోటీసు వల్ల కంపెనీ ఆర్థిక లేదా కార్యాచరణ పనితీరుపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేసింది. రెగ్యులేటరీ ఫైలింగ్‌లో మారుతి సుజుకి ఈ వివరాలను పంచుకుంది. కంపెనీ సమర్పించిన ఆదాయపు పన్ను రిటర్నులకు సంబంధించి అధికారులు కొన్ని అదనపు చేర్పులు, తగ్గింపులను ప్రతిపాదించారని తెలిపింది. ఈ ప్రతిపాదనల విలువ రూ.57,864 మిలియన్లుగా ఉందని, దీని ఆధారంగానే పన్ను డిమాండ్ చేశారని పేర్కొంది. చట్ట ప్రకారం ఈ డ్రాఫ్ట్ ఆర్డర్‌పై డిస్ప్యూట్ రిజల్యూషన్ ప్యానెల్ (డీఆర్‌పీ) ముందు తమ అభ్యంతరాలను దాఖలు చేయనున్నట్లు కంపెనీ వివరించింది. ఈ పరిణామం నేపథ్యంలోనూ స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్టర్లు మారుతి సుజుకిపై విశ్వాసం కనబరిచారు. ట్రేడింగ్ సెషన్‌లో కంపెనీ షేరు ధర 1.82 శాతం పెరిగి రూ.12,986 వద్ద ముగిసింది. ఇటీవలి మూడో త్రైమాసికంలో కంపెనీ పన్నుల తర్వాత రూ.37,940 మిలియన్ల లాభాన్ని ఆర్జించింది.

లయ్యారి చిత్రం

మేఘా రెడ్డి





## బ్యాంకాక్ వెకేషన్‌లో అల్లు అర్జున్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన భార్య స్నేహ రెడ్డి, స్నేహితులతో కలిసి బ్యాంకాక్ వెకేషన్‌కు వెళ్లారు. అక్కడ దిగిన క్యూట్ ఫోటోలను స్నేహ రెడ్డి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అవి కాస్తా వైరల్ అయ్యాయి. వర్క్ టెన్షన్లన్నీ పక్కన పెట్టి బన్నీ ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో చిల్ అవుతూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. సినిమా షూటింగ్‌ల నుంచి చిన్న గ్యాప్ దొరకగానే అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి ఫారిన్ ట్రిప్స్ ప్లాన్ చేస్తుంటారు. ఈసారి బ్యాంకాక్‌ను తన వెకేషన్ స్పాట్‌గా ఎంచుకున్నారు. స్నేహ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసిన ఫోటోలలో బన్నీ ఎంతో కూల్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఇక వాళ్ల ఫ్రెండ్స్ గ్యాంగ్‌తో కలిసి దిగిన గ్రూప్ ఫోటోలు చూస్తుంటే ఈ వెకేషన్ చాలా స్పెషల్‌గా సాగుతున్నట్టు అర్థమవుతోంది.

## ఫాంటసీ కామెడీతో రాకాస




మెగా కూతురు నిహారిక కొణిదెల నిర్మాతగా తన రెండో సినిమా 'రాకాస'తో బాక్సాఫీస్ వద్ద సౌండ్ చేసేలా కనిపిస్తున్నారు. ఈ సినిమా తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ హక్కులను ప్రముఖ సంస్థ శ్రీ లక్ష్మీ నరసింహా మూవీ మేకర్స్ భారీ ధరకు దక్కించుకుంది. ఏప్రిల్ 3న విడుదల కాబోతున్న ఈ ఫాంటసీ కామెడీ చిత్రంపై ఇండస్ట్రీలో మంచి పాజిటివ్ బజ్ ఉండటంతో, డిస్ట్రిబ్యూటర్లు పోటీ పడి మరీ హక్కులను కొనుగోలు చేశారు. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, ఓవర్సీస్ లో కూడా సుమారు 350కి పైగా స్క్రీన్లలో ఈ సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై జీ స్టూడియోస్‌తో కలిసి ఈ ప్రాజెక్టును నిర్మించారు. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్ సోషల్ మీడియాలో మిలియన్ల వ్యూస్ సాధించి సినిమాపై క్యూరియాసిటీని పెంచాయి. ముఖ్యంగా 'మ్యాడ్' సినిమాలతో యూత్ లో మంచి క్రేజ్ సంపాదించుకున్న సంగీత్ శోభన్, ఈ సినిమాలో తన మార్కు కామెడీతో అలరించబోతున్నాడని ప్రమోషన్లు చూస్తుంటే అర్థమవుతోంది.



## ఎందుకురా చంపుతారు

తమిళ స్టార్ హీరో విజయ్, నటి త్రిషల వ్యక్తిగత జీవితం గురించి గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. ఈ రూమర్స్‌పై సీనియర్ నటి ఖుష్బూ తాజాగా స్పందిస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు. ఇతరుల వ్యక్తిగత విషయాల్లో తలదూర్చి ఆనందం వెతుక్కునే వారిపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. త్రిష తనకి ఎంతో సన్నిహితురాలని, ఆమె వ్యక్తిత్వం గురించి తెలియని వారు చేసే కామెంట్స్‌ను అస్సలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఖుష్బూ కుండబద్దలు కొట్టారు. ఆ వివరాలు ఇలా వున్నాయి. ఒక ఇంటర్వ్యూలో ఖుష్బూ మాట్లాడుతూ, విజయ్ మరియు త్రిష ఇద్దరూ తనకు వ్యక్తిగతంగా బాగా తెలుసని చెప్పారు. ముఖ్యంగా త్రిష గురించి ప్రస్తావిస్తూ, తను చూసిన గొప్ప మహిళల్లో త్రిష ఒకరని కొనియాడారు. ఆమె ఎంతో మృదుస్వభావి అని, ఎప్పుడూ హుందాగా ఉంటుందని తెలిపారు. ఇక ప్రస్తుత రోజుల్లో ఎవరైనా చిన్న తప్పు చేసినా, లేదా చివరికి తుమ్మినా సరే వేలెత్తి చూపే పరిస్థితులు ఉన్నాయని, ఇది చాలా దురదృష్టకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. త్రిష లాంటి వ్యక్తిపై అనవసరపు నిందలు వేయడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు.

## ఈ ఏడాదంతా బాలీవుడ్‌లోనే తమన్నా!

మిల్కీ బ్యూటీ తమన్నా బాలీవుడ్ కి వెళ్లినా సౌత్ సినిమాలో మధ్యలో కనిపించడం మాత్రం ఆపలేదు. వచ్చిన అవకాశాలను తెలివిగా సద్వినియోగం చేసుకుంది. తాజాగా అమ్మడి లైనప్ చూస్తే కెరీర్ ఆసక్తికరమైన మలుపు తిరుగుతోందా అన్న సందేహం మొదలైంది. దశాబ్ద కాలానికి పైగా సౌత్ ఇండియాలో ముఖ్యంగా టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా వెలిగిన భామ 2026లో మాత్రం పూర్తిగా బాలీవుడ్‌కే పరిమితం కాబోతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న ప్రాజెక్టులన్నీ దాదాపు హిందీ చిత్రాలే. దక్షిణాదిలో కొత్త సినిమాలేవీ కమిట్ అయినట్లు కనిపించలేదు. దీంతో అమ్మడు మకాం పూర్తిగా ముంబైకి మార్చేసిందా అన్న చర్చ మొదలైంది. ప్రస్తుతం తమన్నా బాలీవుడ్‌లో వరుస పెట్టి క్రేజీ ప్రాజెక్టులు చేస్తోంది. షాహిద్ కపూర్‌తో కలిసి నటిస్తోన్న ఓరోమియో ఆన్ సెట్స్ లో ఉంది. అలాగే సిద్ధార్థ్ మల్హోత్రాతో కలసి -వాన్ లోనూ నటించింది. ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఇవి కాకుండా అజయ్ దేవగన్, సంజయ్ దత్ వంటి స్టార్ హీరోల సరసన రెంజర్ వంటి భారీ చిత్రాల్లోనూ ఛాన్స్ అందుకుంది. ఇవిగాక మరో రెండు మూడు చిత్రాలకు కమిట్ అవుతుందనే వార్తలు అంతకంతకు వేడెక్కిస్తున్నాయి. అంటే 2026 క్యాలెండర్ మొత్తం తమన్నా బాలీవుడ్ సినిమాలతో నిండినట్లే. ఒకప్పుడు తెలుగు, తమిళ భాషల్లో ఏడాదికి నాలుగైదు సినిమాలైనా అమ్మడు రిలీజ్ చేసేది. కానీ ఇప్పుడు అదే సౌత్ సినిమాలకు గ్యాప్ తీసుకోవడం ఆసక్తికరంగా మారింది.





## ఉస్తాద్.. మాస్ క్లాస్‌కు బాస్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ – హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా రిలీజ్‌కు రెడీగా ఉంది. మార్చి 19న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా శ్రీలీల పంచుకున్న విషయాలు ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా ఉస్తాద్ టీమ్ గురించి ఆమె చెప్పిన "మాస్" డెఫినేషన్లు ఫ్యాన్స్‌కు ఫుల్ కిక్ ఇస్తున్నాయి. సినిమా కోసం ఆమె చేసిన త్యాగాలు, థియేటర్లలో చూడాలనుకుంటున్న సందడి గురించి శ్రీలీల ఎంతో ముచ్చటగా వివరించింది. సినిమా టీమ్ గురించి శ్రీలీల ఒక్క మాటలో వివరిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచింది. పవన్ కళ్యాణ్ ని 'మాస్' అని, డిప్యూటీ సీఎం హోదాలో ఆయన 'మాస్ క్లాస్‌కు బాస్' అని కొనియాడింది. ఇక డైరెక్టర్ హరీష్ శంకర్‌ను 'ఫుల్ మాస్' అని, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌ను కూడా 'మాస్' అని చెప్పేసింది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలలో రవి గారిని 'మాస్' అని, నవీన్ గారిని 'క్లాస్ గా కనిపించే మాస్' అని వెరైటీగా వర్ణించింది. ఇక తన తోటి హీరోయిన్ రాశీ ఖన్నాను 'క్లాస్' అని, తన గురించి మాత్రం అది టైమ్‌ని బట్టి మారుతుందని సరదాగా బదులిచ్చింది.



## ఫుల్ ఫాంలో రాశీ ఖన్నా

టాలీవుడ్‌లో ఒకప్పుడు వరుస సినిమాలతో సందడి చేసిన రాశీ ఖన్నా, ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్‌లో జోరు పెంచేందుకు సిద్ధమైంది. పవన్ కల్యాణ్ సరసన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈ నెల 19న విడుదల కానుండటంతో ఆమె ప్రమోషన్లలో బిజీగా ఉంది. ఈ సినిమాపై రాశి ఎన్నో ఆశలు పెట్టుకుంది. పవన్‌తో నటించాలన్న తన కల నెరవేరడమే కాకుండా, ఈ సినిమా తన కెరీర్‌ను మళ్లీ స్టార్ స్టేటస్ వైపు తీసుకెళ్తుందని ఆమె నమ్ముతోంది. నటిగా ఏ సినిమాకైనా కథ వినడం రాశీ ఖన్నాకు అలవాటు. కానీ 'ఉస్తాద్ భగత్ సింగ్' విషయంలో మాత్రం ఆమె రూల్ మార్చుకుంది. పవన్ కల్యాణ్ సినిమా అనగానే మరో ఆలోచన లేకుండా వెంటనే ఓకే చెప్పేసిందట. ఈ సినిమాలో రాశీ ఖన్నా 'శ్లోక' అనే మోడ్రన్ అమ్మాయి పాత్రలో కనిపిస్తోంది. ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాదని, మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్న కథ అని ఆమె వెల్లడించింది. ఇక ముఖ్యంగా పవన్ కల్యాణ్‌ను పాత 'గబ్బర్ సింగ్' తరహాలో వింటేజ్ లుక్‌లో చూస్తారని, అభిమానులకు అది పెద్ద విందు అని హింట్ ఇచ్చింది. ఇందులో పవన్‌తో కలిసి ఒక ఊపు ఊపే మాస్ సాంగ్‌లో కూడా రాశి మెరిసింది. ఈ చిత్రం తనకి టాలీవుడ్‌లో మళ్లీ ఒక బిగ్ బ్రేక్ ఇస్తుందనే నమ్మకంతో రాశి ఉంది. అంతేకాకుండా, మహేష్ బాబు సరసన ఒక స్టైలిష్ యాక్షన్ సినిమాలో నటించాలని తనకి చాలా కోరికగా ఉందని తన మనసులో మాట బయటపెట్టింది.

## అంతా డబుల్ మీనింగులే

భారతీయ సినిమాలో బాలీవుడ్ ఎప్పుడూ ఒక అడుగు ముందే ఉంటుందని చెబుతుంటారు. కానీ, కమర్షియల్ సినిమాల పేరుతో వస్తున్న కొన్ని పాటలు మాత్రం వివాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నాయి. తాజాగా 'కేడీ: ది డెవిల్' సినిమాలోని ఒక స్పెషల్ సాంగ్ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నోరా ఫతేహి డాన్స్ చేసిన ఈ పాటలోని లిరిక్స్ అత్యంత అసభ్యకరంగా ఉన్నాయంటూ నెటిజన్లు మండిపడుతున్నారు. సినిమా ప్రమోషన్ కోసం మేకర్స్ తీసుకున్న ఈ దారి ఇప్పుడు వారికే ఇబ్బందిగా మారింది. ధ్రువ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'కెడి: ది డెవిల్'. ఈ సినిమాలోని ఒక ప్రత్యేక గీతంలో నోరా ఫతేహి తన డాన్స్‌తో ఆకట్టుకున్నప్పటికీ, రకీబ్ ఆలం అందించిన సాహిత్యం మాత్రం వివాదానికి కేంద్రబిందువుగా మారింది. ముఖ్యంగా ఆ పాటలోని కొన్ని లైన్లు వింటుంటే అవి డబుల్ మీనింగ్ కంటే ఎక్కువగా, పచ్చి బూతులా ఉన్నాయని నెటిజన్లు ఫైర్ అవుతున్నారు.

## నాకు నయనతార కావాలి: తమిళనాడు ఎంపీ షణ్ముగం

తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె. స్టాలిన్‌ని విమర్శించే క్రమంలో స్టార్ హీరోయిన్ నయనతారపై ఏఐఏడీఎంకె ఎంపీ షణ్ముగం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ప్రజలు తమ కలలను పంచుకోవాలని, వాటిని నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇస్తూ టీఎన్ ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలని ఉద్దేశిస్తూ తమిళనాడులో మహిళలకు మరింత భద్రతను, గౌరవాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న షణ్ముగం సంచలన వ్యాఖ్యలు చేశారు. అబ్దుల్ కలాం కలలు కనమన్నారు. మన సీఎం స్టాలిన్ మీ కలలేవో చెప్పండి ప్రభుత్వం నెరవేరుస్తుంది అని చెప్పారు. మరి నాకు నయనతార కావాలి. నా కలను నిజం చేస్తారా ఎవరైనా ఆమెతో పెళ్లి కుదర్చమని అడిగితే ఆ కోరికను నెరవేరుస్తారా- అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు తమిళనాట తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.





# ధోనీని ముందు పంపాలి

**టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని బ్రాండ్‌ను కేవలం జట్టుకు ఉపయోగిస్తే సరిపోదని, అతన్ని బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ ఇచ్చి ముందుకు పంపితేనే ప్రయోజనం ఉంటుందని సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ అభిప్రాయపడ్డాడు.**

**అంతేకాదు సంజూ శాంసన్ లాంటి క్రికెటర్ సీఎస్‌కేలో చేరడం ఆ జట్టుకు అదనపు బలాన్ని చేకూర్చనుందని, ధోని స్థానంలో ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగల సత్తా శాంసన్‌కు ఉందని తెలిపాడు.**

'సీఎస్కేకు ధోని పేరు అదనపు బ్రాండ్ అని చెప్పొచ్చు. సీఎస్క్‌పేరు చెప్పగానే అందరి నోటి నుంచి వచ్చే మొదటి పేరు ధోనిదే. అయితే గత కొన్నేళ్లుగా ధోని తూతూమంత్రంగానే జట్టులో కొనసాగుతున్నాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో లోయర్ ఆర్డర్ లోరావడంతో ఎక్కువగా బ్యాటింగ్ చేయలేకపోతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ ధోని బ్యాట్‌తో ఇప్పటికీ ప్రభావం చూపగలడు. కానీ బ్యాటింగ్ ఆర్డర్‌లో 8,9వ స్థానంలో ధోని బ్యాటింగ్‌కు దిగితే జట్టుకు పెద్దగా ప్రయోజనం ఉండదు. ఈ నేపథ్యంలో ధోని బ్యాటింగ్ ఆర్డర్‌లో కచ్చితంగా ముందుగానే క్రీజులోకి రావాలి. కనీసం ఆరో స్థానంలో అయినా బ్యాటింగ్‌కు వస్తే బాగుంటుంది.నేనైతే మాత్రం ధోని నాలుగు, ఐదు స్థానాల్లో బ్యాటింగ్ చేయాలని కోరుకుంటున్నా. గత సీజన్ల మాదిరి ఈసారి అలా జరగకూడదని భావిస్తున్నా' అంటూ చెప్పుకొచ్చాడు.

**బుమ్రానే ఆల్‌టైమ్ టీ20 గ్రేటెస్ట్ ప్లేయర్**

టీ20 క్రికెట్ చరిత్రలో ఆల్‌టైమ్ అత్యుత్తమ ఆటగాడు ఎవరనే చర్చకు సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్ ఆసక్తికర సమాధానమిచ్చాడు. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ టీ20 ప్లేయర్ అని తెలిపాడు. కొత్త బంతి అయినా.. పాత బంతి అయినా చివరకు సూపర్ ఓవర్ అయినా.. బుమ్రా చేతికి బంతి ఇస్తే మ్యాచ్‌ను గెలిపిస్తాడని వివరణ ఇచ్చాడు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వికెట్లు తీయగల సామర్థ్యం అతనికి ఉందని కొనియాడాడు. అయితే తనకు బౌలింగ్ చేయనంత వరకే బుమ్రా గ్రేటెస్ట్ బౌలర్ అని చమత్కరించాడు. తనతో పాటు విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్ వంటి దిగ్గజ బ్యాటర్ల పేర్లు చెప్పకుండా.. డివిలియర్స్ ఒక బౌలర్‌ను ఎంచుకోవడం విశేషం.

# భారత క్రికెట్‌లోనూ పీఆర్ స్టంట్లు



భారత క్రికెట్‌లో ఇటీవలి కాలంలో ఫ్యాన్ ఆర్మీ,సూపర్ హీరో సంస్కృతి బాగా పెరిగిపోయిందని టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఇది భారత క్రికెట్‌ను ఇబ్బందులకు గురి చేస్తుందని తెలిపాడు. ఆటగాళ్ల కంటే వారి పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) ప్రభావం ఎక్కువగా కనిపిస్తోందని, దీనివల్ల ఫ్యాన్‌వార్ పెరిగిపోతుందన్నాడు. కోల్‌కతాలో జరిగిన రేవ్ స్పోర్ట్స్ కాన్‌క్లేవ్ కార్యక్రమానికి హాజరైన అశ్విన్ మాట్లాడుతూ.. 'ఈ ఆటగాడికి ఆ ఆటగాడితో సమస్య ఉంది. అందుకే ఆ ఆటగాడు జట్టులో లేడు.. ఇలాంటివన్నీ సోషల్ మీడియాలో చదువుతుంటే ఆశ్చర్యకరంగా ఉంటుంది. ఇలాంటివే తరచుగా కనబడితే సహజంగానే ఏదో జరుగుతుందన్న అభిప్రాయం కలుగుతుంది. ఇది మానవసహజం. కోచ్ గౌతమ్ గంభీర్ చేయాల్సిన పని చాలా ఉంది. జట్టులో నుంచి నేను, కోహ్లీ, రోహిత్ వెళ్లిపోవాలని అతడు భావించినా ఫర్వాలేదు. అది అతడి పని. నేను ఎప్పుడూ అహాన్ని వదిలించుకోవాలనే చూశాను. ఇక 25 సంవత్సరాల క్రితం ఆస్ట్రేలియాపై వీవీఎస్ లక్ష్మణ్ ఆడిన 281 పరుగుల చారిత్రక ఇన్నింగ్స్ అందరికీ గుర్తుండే ఉంటుంది. కానీ ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఆ మ్యాచ్‌లో భారత్ గెలిచింది కాబట్టి లక్ష్మణ్ ఆడిన ఇన్నింగ్స్ చరిత్రలో నిలిచిపోయింది. అది కేవలం లక్ష్మణ్ వ్యక్తిగత ప్రదర్శన మాత్రమే కాదు.. జట్టు విజయం కూడా. అభిమానులు క్రికెటర్లను ఆరాధించవచ్చు, కానీ డ్రెస్సింగ్‌రూమ్‌లో వ్యక్తులకన్నా జట్టుకే అధిక ప్రాధాన్యం ఉంటుంది' అని అశ్విన్ వెల్లడించాడు.



# పెషావర్‌కు వెళ్లొద్దు

**ఆసీస్ ఆటగాళ్లకు హెచ్చరిక**

పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో మార్చి 26 నుంచి మొదలుకావాల్సిన పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026 సందిగ్ధంలో పడింది. తాజాగా అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఒక ఆసుపత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో దాదాపు 400 మంది చనిపోగా, మరో 250 మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఒకవైపు ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధంతో పశ్చిమాసియా ఇప్పటికే రణరంగంగా మారింది. ఈ నేపథ్యంలో పీఎస్ఎల్‌లో ఆస్ట్రేలియా క్రికెటర్లు కూడా పాల్గొనాల్సి ఉంది. స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, మార్నస్ లబుషేన్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ సహా చాలా మంది ఆసీస క్రికెటర్లు ఈ టోర్నీలో పాల్గొనాల్సి ఉంది. అయితే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా విమాన ప్రయాణాలపై నిషేధముంది. తాజాగా ఆసీస్ ఆటగాళ్లు పీఎస్ఎల్‌లో పాల్గొనేందుకు ఆ దేశ క్రికెట్ బోర్డు కొన్ని షరతుల మీద అనుమతి ఇచ్చింది. అఫ్గానిస్థాన్ సరిహద్దుకు దగ్గరగా ఉండే పెషావర్‌కు దూరంగా ఉండాలని తెలిపింది. అయితే పెషావర్ జాల్మీ పేరుతో పీఎస్ఎల్‌లో ఒక జట్టు ఉండడంతో కచ్చితంగా మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. అయితే పాక్-అఫ్గన్ యుద్ధం కారణంగా పెషావర్ ప్రస్తుతం 'నో ట్రావెల్ జోన్'లో ఉంది. ఈ కారణంగానే ఒకవేళ మ్యాచ్‌లు ఆడేందుకు పెషావర్‌కు వెళ్తే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశముందని ఆసీస్ క్రికెట్ బోర్డు భయపడుతోంది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



# మెక్సికోలో ఇరాన్ మ్యాచ్‌లు?

పశ్చిమాసియాలో భీకరయుద్ధం నేపథ్యంలో ఇరాన్ జట్టు జూన్‌లో జరగనున్న ఫిఫా వరల్డ్‌కప్‌లో పాల్గొనాలా వద్దా అనే సంశయంలో ఉంది. జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరగనున్న 2026 ఫిఫా ప్రపంచకప్‌కు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. అయితే వరల్డ్‌కప్ ఆడేందుకు ఇరాన్ తమ దేశంలో అడుగుపెడితే ఆ దేశ ఆటగాళ్లకు తాము భద్రత కల్పించలేమని, కాబట్టి ఇరాన్ ప్రపంచకప్ నుంచి వైదొలగడమే మంచిదని ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేశారు. అయితే ట్రంప్ కంటే ముందే అమెరికాలో వరల్డ్‌కప్ ఆడబోయేది లేదని ఇరాన్ ముందే భీష్మించుకుంది. తాజాగా ఫిఫా వరల్డ్‌కప్‌లో భాగంగా ముందస్తుగా విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం అమెరికాలో తాము ఆడాల్సిన మ్యాచ్‌లను మెక్సికోకు తరలించాలని ఇరాన్ ఫిఫా సమాఖ్యకు అర్జీ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. యుద్ధం సమయంలో తమ ఆటగాళ్లకు భద్రత ఉండదని, ఏక్షణం ఏమైనా జరిగే అవకాశముంటుందని, అందుకే మా మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికో లేదా కెనడాకు మార్చాలని ఇరాన్ ఫుట్‌బాల్ సమాఖ్య ఫిఫా సమాఖ్యను కోరినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఇరాన్ ప్రతిపాదనపై ఫిఫా సమాఖ్య ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇరాన్ ప్రతిపాదనకు అంగీకరిస్తూ మ్యాచ్ వేదికలను మార్చాలా లేక ఇరాన్ స్థానంలో వేరే జట్టుకు అవకాశమివ్వాలా అన్నది ఆలోచిస్తుంది.

# రెండో టీ20లో కివీస్ గెలుపు

తొలి టీ20లో సౌతాఫ్రికా చేతిలో ఎదురైన పరాభవానికి న్యూజిలాండ్ ప్రతీకారం తీర్చుకుంది. రెండో టీ20 మ్యాచ్‌లో సఫారీ జట్టును మట్టికరిపించి జయభేరి మోగించింది. టీ20 ప్రపంచకప్-2026లో రన్నరప్‌గా నిలిచిన కివీస్.. ప్రస్తుతం స్వదేశంలో ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌తో బిజీగా ఉంది.ఇందులో భాగంగా ఆదివారం మౌంట్ మౌంగనీ వేదికగా ప్రొటీస్‌తో తొలి టీ20లో తలపడ్డ న్యూజిలాండ్.. ఏడు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. తాజాగా హామిల్టన్‌లో మంగళవారం నాటి మ్యాచ్‌లో టాస్ ఓడిన కివీస్.. సౌతాఫ్రికా ఆహ్వానం మేరకు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. టాపార్డర్‌లో ఓపెనర్ టామ్ లాథమ్ (11), వన్‌డౌన్ బ్యాటర్ టిమ్ రాబిన్సన్ (1) నిరాశపరచగా.. మరో ఓపెనర్ డెవాన్ కాన్వే అర్ధ శతకం (60)తో ఆకట్టుకున్నాడు. మిగిలిన వారిలో నిక్ కెలీ (12 బంతుల్లో 21), కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (14 బంతుల్లో 21) ఫర్వాలేదనిపించగా..

# ధోనీ టీమిండియా హెడ్ కోచ్ కావాలి



టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన ప్లేస్‌లోకి రావాలనుకుంటున్నానని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. ధోనీ హెడ్ కోచ్ అయితే తాను కూడా 'నవ్వవయ్యా బాబు'అని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతానని చెబుతూ నవ్వులు పూయించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 విజయానంతరం టీమిండియాను కొనియాడుతూ మహేంద్ర సింగ్ ధోనీ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ పెట్టాడు. ఇందులో గంభీర్ ఎప్పుడూ నవ్వుతూనే ఉండాలని, ఆ నవ్వు చాలా బాగుందని పేర్కొన్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ పోస్ట్‌లపై స్పందించిన గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ధోనీ ప్రత్యక్షంగా ఫైనల్‌కు వచ్చి మ్యాచ్‌లను వీక్షించడం బాగుందని, తనను నవ్వుతూ ఉండాలని చెప్పడం ఇంకా నచ్చిందని గంభీర్ తెలిపాడు. 'ధోనీని ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా అహ్మదాబాద్‌లో చూడటం బాగుంది. ప్రపంచకప్‌ను ప్రత్యక్షంగా వీక్షించడం నచ్చింది. నన్ను నవ్వమన్నందుకు అభినందించాలి. ఏదొక రోజు అతను కూడా నేనుండే స్థానానికి రావాలని కోరుకుంటున్నా. అప్పుడు నేను కూడా నవ్వవయ్యా బాబు అని పోస్ట్‌లు పెడుతా. అయితే డగౌట్ నుంచి అతను తప్పకుండా నవ్వుతాడని భావిస్తున్నా' అని గంభీర్ వెల్లడించాడు.

**కేకేఆర్ నా లక్కీ టీమ్**

కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) ఫ్రాంచైజీతో తనది విడదీయని బంధమని టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపాడు. కేకేఆర్‌తో తనకు అదృష్టమని, కెప్టెన్‌గా, కోచ్‌గా తనకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టిందన్నాడు. అసలు తాను టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ప్రధాన కారణం కేకేఆర్ అని గంభీర్ స్పష్టం చేశాడు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంలో కేకేఆర్ ఫ్రాంచైజీది కీలక పాత్ర అని గంభీర్ తెలిపాడు.' 7-8 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత నేను కోల్‌కతా జట్టు మెంటార్‌గా బాధ్యతలు చేపట్టాను. ఆ సీజన్‌లో కేకేఆర్ మెరుగైన ప్రదర్శన చేసి విజేతగా నిలవడంతో అప్పటి బీసీసీఐ సెక్రటరీ జై షా టీమిండియా హెడ్ కోచ్ పదవిని ఆఫర్ చేశాడు. అయితే గతంలో నాకు హెడ్ కోచ్‌గా పనిచేసిన అనుభవం లేదు. దాంతో మొదట్లో సంకోచించాను. మెంటార్‌గా ఉండటానికి, హెడ్ కోచ్‌గా ఉండటానికి చాలా తేడా ఉంటుంది. అయినప్పటికీ భారత క్రికెట్‌పై నాకు ఉన్న అనుబంధం కారణంగా ఈ సవాల్‌ను స్వీకరించేందుకు అంగీకరించాను' అని పేర్కొన్నాడు.



# అక్కడ నా టైం అయిపోయింది: సంజూ

రాజస్థాన్ రాయల్స్ జట్టులో తన సమయం ముగియడంతోనే బయటకు వచ్చానని ఆ జట్టు మాజీ కెప్టెన్ సంజూ శాంసన్ తెలిపాడు. రాజస్థాన్ రాయల్స్‌కు ప్రత్యర్థిగా ఆడటం ఇదే తొలిసారని చెప్పాడు. ఐపీఎల్ 2026 సీజన్ మినీ వేలానికి ముందు సంజూ శాంసన్‌ను రాజస్థాన్ రాయల్స్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ ట్రేడ్ చేసుకున్న సంగతి తెలిసిందే. 2018 నుంచి 2025 వరకు రాజస్థాన్ రాయల్స్‌కు సంజూ ప్రాతినిథ్యం వహించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బరిలోకి దిగాడు. తాజాగా ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజస్థాన్ రాయల్స్ జట్టును వీడటానికి గల కారణాన్ని సంజూ శాంసన్ వెల్లడించాడు. 'నేను ఆ జట్టులో నా సమయం ముగిసిందని భావించా. అందుకే రాజస్థాన్ రాయల్స్ నుంచి బయటకు వచ్చా. నేను రాజస్థాన్ రాయల్స్‌కు ప్రత్యర్థిగా ఆడటం ఇదే తొలిసారి. ఇలాంటి పరిస్థితి ఇప్పటి వరకు రాలేదు. అయితే నేను ఒక్కసారి మైదానంలోకి వచ్చాక మ్యాచ్ గురించి తప్ప ఇంకేమి ఆలోచించను. రాజస్థాన్ టీమ్‌లో చాలా మంది ఆటగాళ్లతో కలిసి నేను ఆడాను. మేనేజ్‌మెంట్, సపోర్ట్ స్టాఫ్ అంతా నాకు తెలుసు. వారు నా పట్ల చాలా ప్రేమ, గౌరవభావాలు కలిగి ఉన్నారు. కానీ ప్రతీ ఒక్కరికీ ఒక సమయం అనేది ఉంటుంది. రాజస్థాన్ రాయల్స్‌తో నా సమయం ముగిసింది. నేను ముందుకుసాగాను. ఇది నాకు కొత్త ప్రయాణం. ప్రస్తుతం నేను రాజస్థాన్ రాయల్స్‌పై కూడా చాలా ఆనందంగా ఆడాలనుకుంటున్నా. సీఎస్‌కేకు ట్రేడ్ అయిన విషయం తెలియగానే మహీ భాయ్‌తో ఫోన్‌లో మాట్లాడా. అతనితో కలిసి ఒకే జట్టులో ఆడబోతుండడం చాలా గొప్పగా అనిపిస్తుంది. ధోనీ నుంచి నేర్చుకోవడానికి ఇదో మంచి అవకాశం. సీఎస్‌కే తరఫున ఆడేందుకు ఆసక్తి ఎదురు చూస్తున్నా. నాకు ఎంతో మద్దతుగా నిలిచిన చెన్నై అభిమానులకు ధన్యవాదాలు' అని తెలిపాడు.

# సన్‌రైజర్స్ కెప్టెన్‌గా ఇషాన్?



ప్యాట్ కమిన్స్ గైర్హాజరీలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఎవరు నడిపిస్తారనేది తీవ్ర చర్చనీయాంశమైంది. అతని స్థానంలో ట్రావిస్ హెడ్ లేదా అభిషేక్ శర్మ తాత్కలిక కెప్టెన్‌గా ఉండొచ్చని వార్తలొచ్చాయి. అయితే ఈ ఇద్దరూ కాకుండా పాకెట్ డైనమట్ ఇషాన్ కిషన్ పగ్గాలు చెపట్టే అవకాశం కూడా లేకపోలేదు. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మల కంటే సన్‌రైజర్స్ కెప్టెన్సీకి ఇషాన్ కిషన్ సరైనోడని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇషాన్ కిషన్ తన సారథ్యంలోనే జార్ఖండ్‌ను విజేతగా నిలిపాడు. భారత్ టీ20 ప్రపంచకప్ 2026 నెగ్గడంలోనూ ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. 9 మ్యాచ్‌ల్లో 317 పరుగులతో రాణించాడు. అంతేకాకుండా అండర్ 19 ప్రపంచకప్‌లో భారత జట్టుకు సారథ్యం వహించిన అనుభవం కూడా అతనికి ఉంది. మరోవైపు అభిషేక్ శర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్నాడు. ఈ పరిస్థితుల్లో అతనికి కెప్టెన్సీ ఇస్తే మరింత ఒత్తిడికి గురయ్యే ఛాన్స్ ఉంది. ట్రావిస్ హెడ్‌కు కూడా కెప్టెన్ అంత అనుభవం లేదు. కాబట్టి సారథ్య బాధ్యతలు ఇషాన్ కిషన్‌కే ఇవ్వాలని ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. మరీ కావ్య మారన్ ఏం నిర్ణయం తీసుకుంటుందో.

# జహీర్ ఖాన్ కొత్త ప్రయాణం



టీమిండియా దిగ్గజ పేసర్ జహీర్ ఖాన్ కొత్త ప్రయాణం మొదలుపెట్టాడు. ఈయూటీ20 బెల్జియం క్రికెట్ లీగ్‌లో భాగమయ్యాడు. ఆంటెర్ప్ యాంకర్స్ ఫ్రాంఛైజీ సహ యజమానిగా జహీర్ ఖాన్ చేరినట్లు జట్టు యాజమాన్యం తాజాగా వెల్లడించింది. యూరోపియన్ దేశాల్లో క్రికెట్‌కు ప్రాధాన్యం పెంచే క్రమంలో ఈయూటీ20 బెల్జియం క్రికెట్ లీగ్ పుట్టుకొచ్చింది. బ్రసెల్స్ వేదికగా జూన్ 4- 14 మధ్య ఈ లీగ్ నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది. తద్వారా కాంటినెంటల్ యూరోప్‌లో ఇదొక చారిత్రాత్మక ముందడుగు పడనుంది. ఇక ఆంటెర్ప్ యాంకర్స్ సహ యజమానిగా అధికారిక కార్యక్రమాలు, మార్కెటింగ్ కార్యకలాపాలు, మీడియా సమావేశాల్లో జహీర్ ఖాన్ భాగం కానున్నాడు. వ్యాపార భాగస్వామిగా మాత్రమే కాకుండా జట్టును తీర్చిదిద్దడంలోనూ ఈ మాజీ పేసర్ కీలక పాత్ర పోషించనున్నాడు. ఈ సందర్భంగా.. "యూరోప్‌లో క్రికెట్‌కు మంచి భవిష్యత్తు ఉంది. ఆరంభ దశలోనే ఆంటెర్ప్ యాంకర్స్ సహ యజమానిగా చేరడం కేవలం వ్యాపార దృష్ట్యానే కాకుండా జట్టును తీర్చిదిద్దడంలోనూ ఉపయోగపడుతుంది. కొత్త ప్రతిభను వెలికితీసి.. వాళ్లకు వేదిక కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. నా మనసుకు ఎంతో దగ్గరైన ఫ్రాంఛైజీ ఇది. బ్రసెల్స్‌లో జరిగే లీగ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని జహీర్ ఖాన్ పేర్కొన్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 18-3-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు

గల్ఫ్ దేశాల్లో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు అక్కడ నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య చెలరేగిన తాజా ఘర్షణలు గల్ఫ్ ప్రాంతమంతటా విస్తరించే ప్రమాదం ఉండటంతో వలస కార్మికుల కుటుంబాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. పొట్టకూటి కోసం వేల మైళ్ల దూరంలోని గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయులకు ఇప్పుడు యుద్ధభూమిలో బతుకు లీడ్చాల్సిన దుస్థితి ఏర్పడింది. తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుండి వెళ్లిన సుమారు 15 లక్షల మంది సహా దేశవ్యాప్తంగా వలస వెళ్లిన వారు ఇప్పుడు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పటికే ఐదుగురు భారతీయులు వేర్వేరు సంఘటనల్లో మరణించగా, మరికొందరు గల్లంతయ్యారు. యుద్ధం వల్ల గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థ కుదేలైతే, అక్కడ పనిచేస్తున్న వారి ఉపాధికి గండి పడుతుంది. ఇది మన దేశానికి వచ్చే విదేశీ మారక ద్రవ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కోటి మందిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడం భారత ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాల్. ఇప్పటికే దాదాపు 2 లక్షల మంది భారతీయులు స్వదేశానికి తిరిగొచ్చారు. హోర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాలు మూతపడటంతో ముడిచమురు, గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి, ఇది భారత్‌లో ద్రవ్యోల్బణానికి దారితీస్తోంది. ప్రభుత్వం గల్ఫ్ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. మోదీ ఇటీవల కేరళ పర్యటనలో మాట్లాడుతూ, సంక్షోభంలో ఉన్న ప్రతి భారతీయుడిని సురక్షితంగా రక్షించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామని భరోసా ఇచ్చారు. భారత రాయబార కార్యాలయాలు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నాయి. గల్ఫ్ కార్మికులు పంపే నిధులు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటివి. ఈ క్లిష్ట సమయంలో వారిని ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యత మాత్రమే కాదు, సామాజిక కర్తవ్యం కూడా. దౌత్యపరమైన చర్చల ద్వారా ఉద్రిక్తతలను తగ్గించడానికి భారత్ తన శక్తియుక్తులను ఉపయోగించాల్సిన తక్షణ అవసరం ఉంది.

హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా ఎదుగుతోందని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్న వేళ.. నగరం చుట్టూ ఉన్న ఫాంహౌస్‌లు మాత్రం అరాచకత్వానికి చిరునామాలుగా మారుతున్నాయి. నగర శివార్లలో వెలుస్తున్న ఈ విలాస భవనాలు కేవలం విశ్రాంతి కోసమే కాకుండా, డ్రగ్స్ పార్టీలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవిరుద్ధమైన వేడుకలకు వేదికలవుతుండటం ఆందోళనకరం. ఇటీవల వరుసగా బయటపడుతున్న ఉదంతాలు ఈ విష సంస్కృతి ఎంతలా వేళ్లూనుకుందో స్పష్టం చేస్తున్నాయి.

# విలాసాల వెనుక విష సంస్కృతి





**వినోద్ కుమార్**
**ఐటీ ఉద్యోగి**

ప్రభుత్వం, పోలీసు వ్యవస్థలు ఈ వ్యవహారాలను అదుపు చేయడంలో విఫలమవుతున్నాయి. శివార్లలో ఏం జరుగుతుందో నిఘా పెట్టాల్సిన నిఘా వర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేయడం, ఆ తర్వాత మళ్ళీ మామూలే అన్నట్లు వ్యవహరించడం ఒక ఆనవాయితీగా మారింది. రాజకీయ పలుకుబడి ఉన్నవారు, బడాబాబుల పిల్లలు ఈ పార్టీల్లో పాల్గొంటుండటంతో చట్టం తన పని తాను చేయడంలో వెనకడుగు వేస్తోందన్నది నగ్న సత్యం.

అనుమతులు లేని ఫాంహౌస్‌లు, రాత్రింబవళ్లు హోరెత్తే సంగీతం, విచ్చలవిడిగా పారుతున్న మద్యం, యథేచ్ఛగా సాగుతున్న మాదకద్రవ్యాల వినియోగం.. ఇవన్నీ స్థానిక ప్రజల ప్రశాంతతను దెబ్బతీయడమే కాకుండా, సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతున్నాయి. ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా, కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. ప్రతి ఫాంహౌస్ కార్యకలాపాలపై నిశిత నిఘా ఉండాలి. సీసీటీవీ కెమెరాల అనుసంధానం, ముందస్తు అనుమతులు తప్పనిసరి చేయాలి. ప్రభుత్వాల అలసత్వం ఇలాగే కొనసాగితే, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినడమే కాకుండా యువత పెడదోవ పట్టే ప్రమాదం ఉంది. ఇకనైనా సర్కార్ తన మొద్దునిద్ర వీడి, ఈ 'ఫాంహౌస్ అరాచకాలపై' ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చట్టం ఎవరికీ చుట్టం కాదని నిరూపించాల్సిన బాధ్యత పాలకులదే. హైదరాబాద్ శివార్లలోని ఫాంహౌస్‌లు కేంద్రంగా జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, ముఖ్యంగా మాదకద్రవ్యాల వాడకం పెరగడం ఆందోళనకరం. గత కొన్ని సంవత్సరాలుగా, నగర శివార్లలోని మొయినాబాద్, శంకరపల్లి, చేవెళ్ల వంటి ప్రాంతాల్లో ఉన్న ఫాంహౌస్‌లు డ్రగ్స్ పార్టీలకు అడ్డాగా మారుతున్నాయి. మొయినాబాద్‌లోని ఒక ఫాంహౌస్‌పై జరిగిన పోలీసు దాడిలో కొకైన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ పార్టీలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక ఎంపీ, తెలంగాణ మాజీ ఎమ్మెల్యే సహా ఆరుగురు వ్యక్తులు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ అని తేలింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వం డీసీపీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. అంతేకాకుండా, ఆగస్టు 2025లో శంకరపల్లిలోని ఒక ఫాంహౌస్‌లో ఆరుగురు ఐటీ ఉద్యోగులు డ్రగ్స్ వాడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుండి ఎల్ఎస్‌డీ, హషీష్ వంటి ప్రమాదకర మాదకద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ నిరోధానికి ప్రభుత్వం ఈగల్ అనే విభాగాన్ని బలోపేతం చేసినా, ప్రభుత్వం నుంచి ఈ మహమ్మారిని పారదోలడానికి ఇంకా చర్యలు అవసరం. ప్రభుత్వం ప్రస్తుతం డ్రగ్స్ వినియోగంపై జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో ఇలాంటి పార్టీలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

**ఫాంహౌస్‌లలో డ్రగ్స్ సంస్కృతి పెరగడానికి కారణాలు:**

- శివారు ప్రాంతాల్లో ఉండటం వల్ల పోలీసుల నిఘా తక్కువగా ఉంటుందని నిర్వాహకులు భావిస్తున్నారు.
- రాజకీయ నాయకులు, బడా వ్యాపారవేత్తల ప్రమేయం ఉండటం వల్ల కఠిన చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది.
- డ్రగ్స్ పార్టీల ప్రచారం సోషల్ మీడియా ద్వారా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది.



# ప్రాణాలను కల్తీ చేసేస్తున్నారు!

భాగ్యనగరం ఇప్పుడు కల్తీ వ్యాపారాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. లాభమే పరమావధిగా భావిస్తున్న అక్రమ వ్యాపారులు సామాన్యుడి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వంటింట్లో వాడే కారం పొడి నుంచి పసిపిల్లలు తాగే పాలు, చివరకు ప్రాణాలను కాపాడాల్సిన మందుల వరకు అన్నీ కల్తీమయమైపోవడం ఆందోళన కలిగించే అంశం. హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు జరుపుతున్న దాడుల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి.

రంగులు కలిపిన కారం, రసాయనాలతో కూడిన నూనెలు, కుళ్ళిన మాంసం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పండుగలు, శుభకార్యాల సమయంలో ఈ దందా మరింత రెట్టింపు అవుతోంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలనే దురాశతో సామాన్యుల ఆరోగ్యాన్ని బలిపీఠంపై పెడుతున్నారు. ఈ కల్తీ ఆహారం వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. కడుపులో ఇన్ఫెక్షన్ల నుంచి మొదలై, దీర్ఘకాలంలో కిడ్నీ వ్యాధులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు ఈ కల్తీ పదార్థాలు కారణమవుతున్నాయి. తెలిసో తెలియకో ఈ విషాన్ని తింటూ ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. అడపాదడపా దాడులు చేయడం, కేసులు నమోదు చేయడంతోనే ఈ సమస్య పరిష్కారం కాదు. ఆహార భద్రతా విభాగం నిరంతరం నిఘా ఉంచాలి. కల్తీకి పాల్పడే మనుషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. చట్టాల్లోని లొసుగులను వాడుకుని నిందితులు బయటపడకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా శిక్షలు పడేలా చూడాలి. కల్తీ వ్యాపారం అంటే అది కేవలం ఒక నేరం మాత్రమే కాదు, అది సామూహిక హత్యాయత్నంతో సమానం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. తక్కువ ధరకు వస్తున్నాయని నాణ్యత లేని వస్తువులను కొనుగోలు చేయకూడదు. ప్రభుత్వం, యంత్రాంగం ఉక్కుపాదం మోపినప్పుడే ఈ 'కల్తీ మహమ్మారి' నుంచి భాగ్యనగరానికి విముక్తి కలుగుతుంది.

**- శశికుమార్ సారముడి, హైదరాబాద్**



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.